
కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



మార్చి 2011

కొత్తపల్లి తెలుగుపిల్లల ఈ (e) మాసపత్రిక- మార్చి 2011

(**http://kottapalli.in/2011/03 కి పుస్తక రూపం)**

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం: వీరాంజనేయులు

అక్షర కూర్పు: కొత్తపల్లి ఆఫ్‌సెట్‌ప్రెస్

ముద్రిత ప్రతి వెల:

ప్రతి ఒక్కొంటికి రూ. 20/-

పన్నెండుసంచికల ప్రత్యేక వెల: రూ. 240/-

ఈపుస్తకం పూర్తిగా ఓపెన్‌సోర్సు ఉపకరణాలను ఉపయోగించి తయారు చేయబడింది.

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక



ముఖచిత్రం: హోలీ

చిత్రకారుడు: వీరాంజనేయులు

అనుమానం

బుజ్జిగాడికి బాగాలేదు- చిట చిటలాడుతూ, రుసరుసలాడుతూ చాలా కోపంగా ఉన్నాడు.

అంతకుముందు రోజే వాడి కథల పుస్తకం పోయింది- ఎవరు ఎత్తుకెళ్ళారో, ఏమో? పుస్తకం లేకుండా చదువుకునేదెట్లాగ? ఈ రోజున చూస్తే, పెన్సిలు కనబడటం లేదు.

తన వస్తువులన్నీ తీసుకెళ్ళిపోతున్నారు ఎవరో.

"ఇంట్లోనే ఖాళీగా ఉంటుంది కదా, చిన్ని!? అదే తీసుకొని ఉండచ్చు" అనుకున్నాడు: చిన్ని బుజ్జిగాడి చెల్లెలు. దానికి మూడేళ్ళు.

"నాతు పుత్తకం కావాలమ్మా!" అంటూ పుస్తకాన్ని ఎత్తి చేతుల్లో పెట్టుకొని, కాలేజికి పోయే పిల్లలాగా పోతుంటుంది. ఇచ్చెయ్యమని ఎంత మొత్తుకున్నా ఇవ్వదు. ఇపుడు పెన్సిలుకూడా ఎత్తుకెళ్ళినట్లుంది- 'పోనీ, తీసుకెళ్ళి చదువుకుంటుందా' అంటే దానికి ఇంకా బొమ్మలు చూడటంకూడా రాదు పూర్తిగా! ఊరికే, అన్నీ పోగు చేసుకుందామని ఆశ.

బుజ్జిగాడు వెళ్ళి, పాప సామాన్లన్నీ క్రింద పోసి చూశాడు- పుస్తకం, పెన్సిలు కనబడలేదు అందులో: "మరి, ఎక్కడ పెట్టి ఉంటుందబ్బా?!"-

వెళ్ళి ముందుగదిలో పేపర్లు పెట్టే చోట వెతికాడు: అక్కడా లేదు.

"ఇది తీసుకెళ్ళి బయట ఎక్కడో పడేసి ఉంటుంది" అనుకున్నాడు బుజ్జిగాడు.

వాడికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "తనకు ఎంతో ఇష్టమైన కథల పుస్తకం! తను

ఎంతోముచ్చటపడి కొనుక్కున్న గులాబీ రంగు పువ్వుల పెన్సిలు! చిన్నికి బుద్ధి చెప్పాల్సిందే. ఊరుకుంటే లాభం లేదు"

బుజ్జిగాడు వెళ్ళి చిన్ని బొమ్మల్లోంచి కుందేలు బొమ్మను బయటికి లాగాడు. ఆ బొమ్మంటే చిన్నికి చాలా ఇష్టం. లోపలికి రాగానే ఇప్పుడు అది ఆ బొమ్మకోసం వెతుక్కుంటుంది. చిన్నికి దొరకకుండా బట్టల అలమారలో దాచి పెట్టేశాడు బొమ్మని. "నా పుస్తకం, నా పెన్సిలు ఇస్తే, దాని కుందేలు బొమ్మ దానికి దొరుకుతుంది. లేకపోతే తను అదెక్కడుందో ఎన్నటికీ చెప్పడు."

చిన్ని వచ్చింది- ఎగురుకుంటూ, గెంతుకుంటూ. రాగానే దాని కళ్ళు కుందేలు బొమ్మకోసం వెతికాయి.

"ఏయ్, నా కుందేలు బొమ్మ ఏది?" అన్నది. బుజ్జిగాడే తీసి దాచి పెట్టాడని దానికి ఎట్లా తెలిసిందో, మరి!

"నాకు తెలీదు. నా పుస్తకం, పెన్సిలే దొరకలేదని నేను ఏడుస్తున్నాను-నువ్వే తీశావు కదూ?!"

చిన్ని అడ్డంగా తల ఊపింది- "చిన్ని తీస్కోలేదు. చిన్నికేం తెలీదు"

"అబద్ధం!" అరిచాడు బుజ్జి. "నా పుస్తకం, పెన్సిలు నువ్వే తీసుకున్నావు. ఎక్కడ పెట్టావో చెప్పు! ఎప్పుడూ నువ్వే నా వస్తువులన్నీ తీసుకుంటావు. ఇచ్చెయ్, నావి నాకు!"

"చిన్ని తీస్కోలేదమ్మా! బుజ్జన్న సామాన్లు బుజ్జన్న దగ్గరే ఉంటాయి" అన్నది చిన్ని.

"ఇదిగో చెబుతున్నాను- నా పుస్తకం పెన్సిలు నాకు ఇచ్చెయ్యి. లేకపోతే నీ కుందేలు నీకు ఎప్పటికీ అసలు దొరకనే దొరకదు"

చిన్ని లేచివెళ్ళి బుజ్జిగాడి సంచీ తీసింది. అందులోని సామాన్లన్నీక్రిందికి వంపి, కుప్ప పోసింది.

"చూస్కోమ్మా! నీ పుస్తకం, పెన్సిలు నీ దగ్గరే ఉన్నై" అంది.

బుజ్జిగాడు ఆశ్చర్యపోయాడు. కుప్పలోనే ఉన్నై, తన పుస్తకమూ, పెన్సిలూ! "మరి అవి తనకెందుకు కనబడలేదు, ఇందాక?"

బిక్కమొఖం వేసుకొని వెళ్ళి, బట్టల మధ్యలోంచి కుందేలు బొమ్మను తెచ్చి ఇచ్చేశాడు చిన్నికి.

"మా బుజ్జన్న ఎంత మంచిదో చూడు! అన్నీ జాగ్రత్తగా ఎత్తి పెడుతుంది!" అని మురిసిపోయింది చిన్ని, కుందేలును ఎత్తుకుంటూ.

చాలాసార్లు మనం పోగొట్టుకున్నవి మనకు కనబడవు. వేరేవాళ్ళెవరో వాటిని పోగొట్టిఉంటారన్న అనుమానం కొద్దీ, మనం సరిగ్గా వెతకం కాబోలు.

అనుమానాలు ప్రక్కన పెట్టేసి చూస్తే, వస్తువులు ఉన్నవి ఉన్నట్లు కనబడతాయి. ఏమంటారు?

అభినందనలతో,

కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

17 వ భాగం

జరిగిన కథ: దమనకం సింహరాజు దగ్గరికి వెళ్ళి, ఎద్దు మీద అనుమానం రేకెత్తిస్తుంది. రాజ శత్రువులతో ఎద్దు స్నేహం నెఱపుతున్నదని నమ్మబలికేసరికి, ఆ ఎద్దుని బాగా నమ్మిన పింగళకం కాస్త చిన్నబోతుంది. అదే అవకాశంగా దమనకం తన సోదరుడైన కరటకాన్ని రాజుకు సలహాలిచ్చేందుకు పిలిపిస్తుంది. ఇక చదవండి, నీతి చంద్రిక 17 వ భాగం..

రచన: పరవస్తు చిన్నయసూరి *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

కరటకుడు వినయం ఉట్టిపడేట్లు వచ్చి నమస్కరించగానే, సింహరాజు దాన్ని మర్యాదగా పలకరించి, కూర్చొనేందుకు తగిన ఆసనం చూపించింది. ఆపైన అది దమనకుడివైపుకు చూసి "ఆ విషయాన్ని సంపూర్ణంగా వినిపించు ఇతనికి" అని ఆదేశించింది. అప్పుడు దమనకుడు లేచి నిలబడి, సంజీవకుడు గతంలో ఎట్లా ఉన్నదీ, ఇప్పుడు ఎట్లా ఉన్నదీ చెప్పింది, కరటకుడికి. ఆపైన తానూ, రాజుగారూ

ఏమనుకున్నదీ వివరించింది. "నేను చెప్పిన సంగతీ, రాజుగారి అభిప్రాయమూ-రెండూ విన్నావు గదా? ఇప్పుడు నీకేమి అనిపిస్తున్నదో చెప్పు" అన్నది.

అప్పుడు కరటకుడు కొంచెం సేపు ఆలోచించి, దమనకుడి వైపుకు చూసి "ప్రభువులవారికి తెలీని విషయం అంటూ లేదు- ఏది సరైనదో, ఏది కాదోనిర్ణయించేందుకు మనం ఎంత వాళ్ళం? అయినప్పటికీ, మంత్రి పదవిలో ఉన్నవాళ్ళం- కనుక సందర్భం కొద్దీ మనసుకు తోచినది చెప్పక ఊరకుండకూడదు. అవకాశం చూసుకొని రాజద్రోహం చేసినవాడిని ఊరికే బహిష్కరిస్తే చాలదు- అట్లా బహిష్కరింపబడ్డవాడు శత్రువుతో కలిసి పగ సాధించుకునేందుకు ప్రయత్నిస్తాడు తప్ప, తన తప్పును గుర్తించడు. గోటితో పోయేదాన్ని అప్పుడు గొడ్డలితో తీర్చవలసి వస్తుంది. అలాకాక, ద్రోహిని ఎప్పటిలాగానే కలుపుకొని పోతూ, అతని దుష్కార్యాన్ని ఉపేక్షించినట్లైతే, ఒక సారి తప్పుడు ప్రయత్నం చేసి విఫలమైన మనస్సుతో గల ఆ ద్రోహి 'మరొకసారి ఆపద ఎలా తేవాలా' అని ఆలోచించటానికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది- అట్లాంటివాడి వల్ల అపాయమే తప్ప, ప్రయోజనం ఏముంటుంది? అందువల్ల రాజు తనకు కీడు తలపెట్టినవాడిని ఊరికే వదిలిపెట్టకూడదు" అన్నది.

ఆ మాటలు విని పింగళకుడు "కరటకా, నువ్వు అన్నది నిజమే. అయినప్పటికీ చిరకాల స్నేహం వల్ల, వాడికి ఇప్పుడు ఏదైనా పెద్ద శిక్ష వేయాలంటే నాకు మనస్సు రావటం లేదు. నేనేం చేసేది?" అన్నది.



అప్పుడు కరటకుడు "ఆరోగ్యం కావలసినవాడు వైద్యుడినుండి ఔషధాన్ని ఎలాగైతే ఆశిస్తాడో, అదే విధంగా రాజన్నవాడు తన సేవకుడినుండి సద్భావనను ఆశించాలి. దేవరవారికి తెలీనిది ఏమున్నది? కొంచెం దూరదృష్టితో ఆలోచించారంటే, ఏమి చేయాలో దానంతట అదే మనసుకు తట్టగలదు. నీతి ఎఱిగిన రాజు- జాగ్రత్తగా పరీక్షించి, 'మంచివాడు' అని తేలిన వాడిని చేరదీయాలి తప్పిస్తే, ఎవరిని పడితే వారిని దగ్గరచేసుకుంటే చివరికి ముప్పు తప్పదు. 'మంద విసర్పిణి' అనే పేను ఒకటి, 'డిండిమం' అనే నల్లితో సహవాసం చేసి ఆపదల పాలు కాలేదా? ఆ కథ చెబుతాను వినండి" అన్నది.

నల్లి-పేను కథ

అనగా అనగా 'మంద విసర్పిణి' అనే పేను ఒకటి ఉండేది. అది చాలాకాలంగా ఒక రాజుగారి మంచాన్ని ఆశ్రయించుకొని, జాగ్రత్తగా మసలుకుంటూ జీవించేది.

అంతలో ఒకనాడు 'డిండిమం' అనే నల్లి ఒకటి ఆ మంచంలోకి వచ్చి చేరుకున్నది. మందవిసర్పిణి దానికి ఎదురేగి స్వాగతం ఇచ్చి, అతిథి మర్యాదలు చేసి, కుశల ప్రశ్నలు వేసి, 'ఇక్కడికి వచ్చిన కారణం ఏమిటి?' అని అడిగింది.

అప్పుడా నల్లి "నాకు పరమ మిత్రుడివైన నీనుండి ఒక సహాయాన్ని కోరి ఇట్లా వచ్చాను. నీ అనుగ్రహం ఉంటే నా కోరిక అవలీలగా నెరవేరగలదు" అన్నది.

"అయ్యో, నాకు ప్రాణ సమానుడివే, స్నేహితుడివే, నీ కోరిక నా వశంలో ఉన్నదైతే దానికి ఇంతగా అడగాలా? నీకు ఇవ్వటానికి పనికిరాని సంపద నాకంటూ ఉండి ఏమి ప్రయోజనం? నా సంపద అంతా నీదే- యధేచ్ఛగా వాడుకో" అన్నది పేను.

సంతోషించిన నల్లి "ఎంతో కాలంగా రకరకాల మనుషుల రక్తాలను రుచి చూసి ఉన్నాను గాని, రాజుగారి రక్తాన్ని ఏనాడూ రుచి చూసి ఎరుగను. బియ్యపు అన్నాన్ని,

ఎప్పటికప్పుడు చిలికిన ఆవు వెన్నను కాచిన నేతిని, తియ్యని పప్పు చారును, అద్భుతమైన కూరలను, రుచికరమైన పిండివంటలను, వివిధ ఫలాలను, బలాన్నిచ్చే రకరకాల పానీయాలను, పలు రకాల మాంసాలను, ఆవు పాలను, సారాయాలను, అనేక రకాల ఊరగాయలను, మీగడ పెరుగును, చక్కెర, పటిక బెల్లంలను, సువాసనలీనే పలు ద్రవ్యాలను- ఇంకా ఇట్లాంటి మరెన్నో మంచి మంచి పదార్థాలను తింటూ, ఎండకన్ను ఎరుగని రాజుల ఒంటి రక్తం చాలా రుచిగా ఉంటుందని విన్నాను- తప్పిస్తే ఎన్నడూ రుచి చూడలేదు. ఈ మంచం మీద నేనుకూడా నివసించేందుకు అంగీకరించావంటే చాలు- నా యీ ఒక్క కోరిక నెరవేరుతుంది- దయచేసి సరేనను!" అన్నది.

అప్పుడు మందవిసర్పిణి మొహమాట పడింది- నల్లికి ఎదురు చెప్పలేకపోయింది. "సరైన సమయం చూసుకొని, తొందర పడకుండా, రాజు గారు ఒళ్ళు మరచి నిద్రపోయిన తరుణంలో, ఆయనను మెల్లగా కొరికి, నొప్పి తెలియనివ్వకుండా రక్తం పీల్చుకొని, మెలకువతో ప్రక్కకు తప్పుకోవాలి- జాగ్రత్తగా మసలుకోవాలి- సరేనా?" అని మాత్రం అనగల్గింది.



"నువ్వు ఎట్లా చెబితే అట్లాగే చేస్తాను" అని మాట ఇచ్చి, నల్లి ఆ మంచంలోకి చేరుకున్నది. తను ఇంతకాలంగా అనుభవించటానికి వీలు కానిది ఇప్పుడు తన చేజిక్కేసరికి, అది సంతోషం పట్టలేకపోయింది. ఆశ యొక్క వేగాన్ని ఇక ఆపుకోలేక పోయింది, రాజుగారు

ఇంకా నిద్రలోకి జారీ జారకుండానే అది పోయి, ఆయనను తనివితీరా కుట్టింది.

మరుక్షణం ఆ రాజు "ఛీ! ఛీ!" అని చీదరించుకుంటూ ఉలిక్కిపడి లేచి, తన కాళ్ళు ఒత్తుతూ దగ్గరలోనే నిలబడ్డ సేవకుడిని చూసి "ఓరీ! ఏదో తేలు కుట్టినట్లు నా శరీరమంతా మండుతున్నది. వెంటనే దీపాన్ని ఒకదాన్ని దగ్గరికి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. వాడు వెళ్ళి దీపం తెచ్చేంతలో నల్లి జారుకొని దూరంగా నక్కింది. దీపాన్ని తీసుకువచ్చిన పరిచారకులు మంచాన్ని అన్ని వైపులనుండీ అనేక విధాలుగా పరీక్షించి చూసారు. వాళ్ళకు నల్లి అయితే కనబడలేదుగానీ, మంచానికి ఒక ప్రక్కన- చిన్న నలుసులాగా పట్టుకొని ఉన్న పేను కనబడింది! 'రాజుగారిని కరిచింది ఇదే' అని వాళ్ళు కాస్తా దాన్ని చంపేశారు. కాబట్టి, స్వభావం ఎలాంటిదో తెలుసుకోకుండా ఇతరులను దరి చేరనిచ్చినవాడికి కీడు తప్పదు.

ఆ కథను విని, పింగళకుడు "నాకు కోపం తెప్పించిన జంతువు ఎంతటిదైనా సరే- ప్రాణాలతో ఉండలేదు: ఈ సంగతి లోకం అంతటికీ తెలుసు. సంజీవకుడు నాతో పోరు కోరటం నిజంగా ప్రళయకాలపు అగ్నిలోకి దూకటమే కదా? అయినా నువ్వే చెప్పు, సంజీవకుడు నాకు ఏం కీడు చెయ్యగలడంటావు?" అన్నది.

అది విని కరటకుడు "మనతో చాలా కాలంగా పరిచయం ఉన్నవాడికి మనగురించిన రహస్యాలు అనేకం తెలిసి ఉంటాయి. అలాంటివాడు అల్పజీవి అయినప్పటికీ, ఏదో ఒక విధంగా మనల్ని సాధించగలడు. ఏలాంటివారైనా ఒకప్పుడు కాకపోతే మరి ఒకప్పుడు పరాకుగా ఉండవచ్చు కదా?, అలా పరాకుగా ఉన్నప్పుడు అల్పుడైన శత్రువుకు కూడా అవకాశం లభిస్తుంది. నీతి తెలిసినవాడు శత్రువుని 'అల్పుడేలే' అని వదిలిపెట్టడు" అన్నది.

అదివిని, పింగళకుడు కొంచెం

ఆలోచించి, "మనం ఈ సమయంలో సంజీవకుడికి ఏదైనా కీడు చేశామంటే లోకం మనల్ని నిందిస్తుంది తప్ప, అసలు రహస్యం బయటికి రాదు. లోకంలో రాగల చెడ్డ పేరుకు భయపడాలి. అంతేకాదు, ఆలోచించకుండా త్వరపడి నిర్ణయాలు తీసుకొనే రాజుని చూసి, మంత్రివర్గం విరక్తి పాలౌతుంది. దానివల్ల ఇక పనంతా చెడిపోతుంది.



అందువల్ల, నాకు చివరగా ఏమనిపిస్తున్నదో చెబుతాను- వినండి: దమనకుడు సంజీవకుని దగ్గరికి పోయి, అతనితో- "నువ్వు రాజద్రోహులతో స్నేహం చేస్తున్న సంగతి రాజుగారికి తెలిసిపోయింది. ఆయన చాలా కోపంగా ఉన్నాడు. అయినప్పటికీ ఆయన దీనవత్సలుడు- దీనుల పట్ల దయగలవాడు- కనుక, నువ్వు నా వెంట వచ్చి, నీ తప్పును ఒప్పుకొని ప్రార్థించినట్లైతే నిన్ను క్షమించగలడు" అని చెప్పు. మనకు చేతనైనంత వరకు కలుపుగోలుగా ఉండటానికే ప్రయత్నిద్దాము. "నీచా: కలహమిచ్ఛంతి- సన్ధిం ఇచ్ఛంతి సాధవ:"- 'నీచులు పోరును కోరతారు; కానీ సజ్జనులు రాజీని ఇష్టపడతారు'- అని పెద్దలు చెబుతారు కదా. ఊరికే వేరుపడాలనుకుంటే దానికి ఎంతసేపు పడుతుంది? మనం సరైన మార్గంలోనే పోదాము. సంజీవకుడు నీ మాటలు విని, అనుకూలుడై, మన దారికి వచ్చినట్లైతే మేలు- లేదంటే తన చేతలకు తగిన ఫలం అనుభవిస్తాడు" అని, దమనకుడిని చూసి- "ఇక నువ్వు పోయిరా. మనం ఇక్కడ మాట్లాడుకున్న విషయాలేవీ అక్కడ ప్రస్తావించకు" అన్నది.

అప్పుడు దమనకుడు "సరే" అని తల

ఊపి, మెల్లని నడకలతో సంజీవకుడిని చేరబోయాడు. ముఖంలో దీన భావనతోటీ, వణికే కాళ్లతోటీ తన దగ్గరికి వచ్చిన ఆ నక్కను చూసి సంజీవకుడు ఎదురేగి, తోడ్కొని వచ్చి, తగిన ఆసనం మీద కూర్చోబెట్టి 'ఎందుకు, ఇలా విచారంగా ఉన్నాడు?' అని మనస్సులో అనుకుంటూ, "మీరంతా కులాసాగా ఉన్నారు కదా!" అన్నాడు.



దానికి దమనకుడు నిట్టూరుస్తూ "ఇతరులకు ఊడిగం చేసుకునేవాడికీ, కులాసాకూ ఎంత దూరం! రాజ సేవకుడన్నవాడు చావుకు దగ్గరైనవాడితో సమానం. రాజుగారి అనుగ్రహం, నమ్మకం పొంది ఎక్కువ కాలం సుఖిద్దామను-కునేవాడు, ఎండమావుల్లో పారే ఏటిని చూసి దాహం తీర్చుకునేందుకు పరుగులెత్తేవాడే. రాజుగారి అనుగ్రహానికి ఏకాంతంలోకూడా ఆరాటపడే వెర్రివాడు ధీరుడు అనిపించుకోడు" అన్నది.

అది విని సంజీవకుడు "నీ మాటల తీరును బట్టి చూస్తే ఏదో విశేషం ఉన్నదని తోస్తున్నది" అని, తమను ఒంటరిగా వదలి అవతలికి వెళ్ళమన్నట్లుగా తనకు ఇరువైపులా చూశాడు. దగ్గరలోనే ఉన్న కాటక-పాటకులిద్దరూ వెంటనే లేచి దూరంగా పోయారు. అప్పుడు దమనకుడు కళ్ళతోటే వారివైపు చూపిస్తూ "వీళ్ళను దగ్గర చేసుకోవటమే నీ కష్టాలకు మూలం అయ్యింది" అన్నది. అదివిని సంజీవకుడి మనస్సు భయంతో నిండిపోయింది- "ఏమైంది? అక్కడ ఏం జరిగింది?" అని ఆ ఎద్దు ఆత్రంగా ప్రశ్నించింది దమనకుడిని.

(మిగతాది వచ్చేసారి...)



అమ్మ మాట వినక పోతే...

తొమ్మిదో తరగతి చదివే వెంకటరమణ 'బాల' పత్రికకోసం రాసిన ఈ కథనోసారి చదవండి. ఇందులో చెప్పినట్లు, వాడు అమ్మ చెప్పిన మాట వినీ-వినీ, బుద్ధిగా ఉండీ ఉండీ- చాలా గొప్ప వాడు అయిపోయాడు. చిన్నప్పటి ఆ పిడుగు చివరికి పెద్ద తాతయ్య కూడా అయిపోయి, ఒక వారం రోజులక్రితమే- తన మకాం మార్చుకొని స్వర్గానికి వెళ్ళిపోయాడు. తెలుగు వచ్చిన ప్రతి చదువరికీ ఆయనంటే ఉన్నది ఇంతింత గౌరవమూ, ఇంతింత అభిమానమూ కాదు.

రచన: ముళ్ళపూడి వెంకటరమణ. *ప్రథమప్రచురణ: 'బాల'- ఆగస్టు 1945.*

నేనూ, మా అన్న ఉండేవాళ్ళం, మా యింటికల్లా పిల్లలం. మా ఇంటికెవరేనా పిల్లలొస్తే మాకెంతో సంతోషంగా ఉండేది. ఎవరూ లేనప్పుడు, మేం చదవనప్పుడూ మేమిద్దరం ఆడుకునేవాళ్లం.

ఇలా ఉంటుంటే- మా యింటికి చుట్టాలొచ్చారు. వాళ్లతో వాళ్ల పిల్లలు ముగ్గురు వచ్చారు- సూర్యం, భాస్కరం, నారాయణ. మాకు లేక లేక నేస్తాలు దొరకడం మూలాన్నీ, మా నాన్నగారు ఇంట్లో లేని మూలాన్నీ ఆ వేళ మధ్యాహ్నం అంతా ఆటలాడేశాం. ఆ వేళ పౌర్ణమి రాత్రి వెన్నెట్లో దొంగాటాడుదాం అని పెంద్రాళే అందరం అన్నాలు తినేశాం. మా

అన్నావాళ్ళు అప్పుడే మా యింటి ముందర సిద్ధంగా కూర్చున్నారు.



నేను కూడా వెళ్ళిపోతుంటే, మా అమ్మ అంది-"నాయనా! పొద్దున్నుంచి పుస్తకం ముట్టుకోలేదు కదా! ఇప్పుడేనా చదవరాదూ? రాత్రిళ్ళు ఆటలేమిటీ? పురుగూ పుట్రాను!" అంది. నేనన్నానూ-"అమ్మా! పొద్దున్నేకదే పుస్తకాల పెట్టి సర్దేనూ? పుస్తకం ముట్టుకోలేదంటావేం?" అని, అమ్మ ఒద్దంటున్నా కూడా వినకుండా పెరట్లోకి పారిపోయాను.

సరే, దొంగాటకి పంటలేసుకున్నాం. సూర్యం దొంగయ్యాడు. ఉన్నవాళ్ళలోకి నేనే కొంచెం చిన్నవాణ్ణి. అందుచేత నన్నే సూర్యం తరిమాడు. పరిగెడుతూ కంగారులో ఓ కప్పని తొక్కాను. బెదిరిపోయి నాలాగే గెంతుతున్న ఆ కప్ప నా కాళ్ళకింద పడింది. ఆ కంగారుతో వరండాలోకి పరిగెత్తాను. పొద్దున్న తిని పారేసిన అరిటిపండు తొక్కమీద కాలు పడింది. అది బోరగిల్లా ఉందేమో, పడీ పడ్డంతోటే కాలు జారి కింద పడ్డాను. తలకి, మోచేతికి దెబ్బలు తగిలాయి.



అప్పుడే ఆఫీసునుంచి వస్తున్న మా నాన్నారు నన్నప్పుడు తీసుకెళ్ళి పక్క మీద పడుకోబెట్టి సేదతీర్చిన తరువాత, తాపీగా నే చెప్పిందంతా విని ఫక్కున నవ్వి, అన్నారు: "చూశావా! అమ్మకి పెంకి సమాధానం చెప్పి, అమ్మ వద్దంటున్నా ఆటకి వెళ్ళినందుకు ప్రతిఫలం చూశావా! అమ్మ మాటే వినుంటే నీకు ఈ తిప్పలే లేకపోను గదా" అని బుద్ధి చెప్పారు. తక్కిన పిల్లలంతా బొమ్మల్లా నిలబడిపోయారు.

అప్పడ్నించి నేను అమ్మ చెప్పినట్లు విని బుద్ధిగా ఉంటున్నాను.

జోకులు

మాస్టర్ మైండ్!

ఒక వ్యక్తి జాబ్ అప్లికేషన్ నింపుతున్నాడు:

"మీరు ఎప్పుడైనా అరెస్టు అయ్యారా?" అనే ప్రశ్న కనిపించింది-

"లేదు" అని సమాధానం రాశాడు.

తర్వాత 'ఎందుకు?'అనే ప్రశ్న దగ్గర- ఇలా రాశాడు:

'ఎప్పుడూ దొరికిపోలేదు కనుక' అని.

కలర్ గ్యారెంటీ!

వెంగళప్ప కలర్ టీవీ కొన్నాక, ఒక సారి దాన్ని పూర్తిగా నీళ్లలో ముంచి లేపాడు- ఎందుకని?

"రంగు పోతుందో లేదో చూద్దామని"

సేకరణ: G. సుచరిత



చదువు



రచన: పి.హరికుమార్,9 వతరగతి,ప్రకృతిబడి.

అనగనగా ఒక ఊళ్లో రామయ్య అనే ధనవంతుడు ఒకడు ఉండేవాడు. అతనికి ఒక్కడే కొడుకు- హరి. వాడు ఎప్పుడూ క్రికెట్ అంటూ తిరిగేవాడు. బడికి వెళ్ళకుండా క్రికెట్ ఆడేవాడు. రామయ్య మాత్రం ఎప్పుడూ "బడికి పోరా" అని పోరుతుండేవాడు హరిని . హరి మాటల్ని పెడచెవినపెట్టేవాడు.

అలా ఒక సంవత్సరం గడిచిపోయింది. అనుకోకుండా ఒకరోజున రామయ్యస్నేహితుడు ధనయ్య వచ్చాడు, వాళ్ల ఇంటికి. రామయ్య ధనయ్యతో తన కొడుకుగురించిచెప్పుకొనిబాధపడ్డాడు.

అంతా విన్న తర్వాత ధనయ్య రామయ్యతో "ఒకసారి నీ కొడుకును మా ఇంటికి పంపరాదూ?" అన్నాడు.

"సరేలేరా! అలాగే పంపుతాను" అన్నాడు రామయ్య. మరునాడే కొడుకుని ధనయ్య ఇంటికి పంపాడు కూడా. సరే అని, హరి ధనయ్య ఇంటికి బయలు దేరివెళ్లాడు.

ధనయ్య వాడిని లోపలికి పిలిచి "ఒరే హరీ! నీకు చదువు అంటే ఇష్టం లేదా?" అని అడిగాడు. "లేదు మామయ్యా! నాకు క్రికెట్ అంటే ఇష్టం!" అన్నాడు హరి. ధనయ్య కొంచెం సేపు ఆలోచించి "హరీ! నీకు ఒక కథ చెప్తాను విను" అని ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు:

"అనగా అనగా ఒక అడవిలో ఒక కాకి ఉండేది. అది ఒక రోజున ఎక్కడ నుండో ఒక మాంసపు ముక్కను తీసుకొని వచ్చి, ఒక చెట్టు మీద కూర్చొని తినటం మొదలు-పెట్టింది. అంతలో అటు ప్రక్కగా వెళ్తున్న నక్క ఒకటి దానిని చూసింది. కాకి దగ్గరకు వచ్చి "కాకిబావా! కాకిబావా! నువ్వు ఎంత తియ్యగా పాడుతావో, కోకిల కంటే తియ్యగా పాడుతావు" అన్నది.

కాకి మాంసం ముక్కను కాళ్ళ మధ్యన పెట్టుకొని, "నక్కబావా! నేను ఏడో తరగతి వరకు చదువుకున్నాను. మూడవ తరగతిలోనే కాకి-నక్క కథను చదివేశాను. నన్ను నువ్వు మోసం చేయాలనుకున్నావా , నాకేం చదువు రాదనుకున్నావా?" అని నవ్వింది.




నక్క ఇంకేమీ చేయలేక, సిగ్గుతో తల వాల్చుకొని వెళ్ళిపోయింది. కాకి చక్కగా మాంసం ముక్కనంతా తిన్నది. ధనయ్య కథని ముగించి "హరీ! విన్నావు కదా! చదువుకుంటే ఎంత మేలు!" అన్నాడు.

ఆ మాటలు విన్న హరిలో ఏదో

కలవరం మొదలైంది. ఆలోచలో పడ్డాడు మరుసటి రోజునుండీ బడికి వెళ్లటం మొదలుపెట్టాడు.

ఇక ఆ సంవత్సరం వాడు చాలా పట్టుదలగా చదివాడు, బడిలో ఉత్తమ విద్యార్థిగా పేరు పొందాడు. "ఒక్క కథ వల్ల ఎంత మార్పు వచ్చింది!" అని రామయ్యతో పాటు ధనయ్య కూడా ఆశ్చర్యపడ్డాడు.



బీపీ!

రాము : రోజూ పొద్దున్నే ఎక్కువ టెన్షన్ పడేది ఏదిరా?

సాము : ప్రెషర్ కుక్కర్ .

తల రాత!

జోతిష్యుడు : జాతకం చూపించుకొని డబ్బులివ్వకుండా వెళుతున్నావేంటి?

కస్టమర్ : ఈ సంవత్సరం పిల్లికి కూడా బిచ్చం పెట్టనని నువ్వే చెప్పావుగా.

సేకరణ: బి.దివ్య





దుస్తులు-వ్యక్తిత్వం

రచన: డి.కవిత,9 వతరగతి,శాంతినికేతన్ విద్యాలయం,జహీరాబాద్.

ఒక ఊళ్ళో వినోద్ అనే పిల్లవాడు ఉండేవాడు. వాళ్ళది ధనవంతుల కుటుంబం. అతను ఎప్పుడూ ఖరీదైన బట్టలే వేసుకునేవాడు. ఒక రోజున వినోద్ బడికి వెళ్తుంటే దారిలో ఒక అబ్బాయి కనిపించాడు-

వాడు వినోద్ ని చూసి నవ్వుతూ "నా పేరు శీను. మేము ఈ వీధిలోకి కొత్తగా వచ్చాం. నేను కూడా మీ బడిలోనే చదువుతున్నాను!" అని చెప్పాడు. శీను వేసుకున్న నలిగిపోయిన బట్టలు, అరిగిపోయిన చెప్పులు వినోద్ కి ఏమాత్రం నచ్చలేదు.

వాడు శీనుతో ఒక్కమాట కూడా మాట్లాడకుండా, ముఖం ప్రక్కకు తిప్పుకొని, గబ గబా నడుస్తూ వెళ్ళి-

పోయాడు. శీను పాపం, చిన్నబోయాడు. ఆ రోజున బడిలో కూడా చాలాసార్లు ఎదురయ్యాడు శీను- కానీ అన్నిసార్లూ ఈసడింపుగా ముఖం తిప్పుకుంటూనే ఉన్నాడు వినోద్. "వీడికేముంటై, తెలివి తేటలు?" అనుకున్నాడు తప్ప, శీనుతో ఒక్క మాట కూడా మాట్లాడ లేదు వాడు.



ఇట్లా కొన్ని రోజులు గడిచాయి. అయినా వినోద్ దృష్టిలో శీను విలువ ఏమాత్రం పెరగలేదు- "నాకు వాడంటే ఇష్టం లేదు-అంతే! నేను అట్లాంటి వాళ్లతో మాట్లాడనే మాట్లాడను!" అనుకున్నాడు.

అయితే ఆ తర్వాత ఒక రోజున వినోద్ బడికి వెళ్తూండగా అనుకోకుండా ఒక చెట్టు కొమ్మ విరిగి అతని మీద పడబోయింది. సమయానికి దగ్గర్లోనే ఉన్న శీను ముందుకి దూకి, వాడి చెయ్యి పట్టుకొని ఇవతలికి లాగకపోతే వాడు ఆస్పత్రి పాలై ఉండేవాడు!

చుట్టూ ఉన్నవాళ్లంతా శీనును మెచ్చుకున్న తర్వాత, వినోద్‌కు అర్థమైంది, అతని మంచితనం ఏమిటో! తను వాడిని ఎంతో చులకనగా చూసినప్పటికీ, అది మనసులో పెట్టుకోకుండా తనను కాపాడాడు వాడు!

వినోద్ శీనుకు కృతజ్ఞతలు చెప్పటమే కాకుండా తన ప్రవర్తన పట్ల క్షమాపణ కోరాడు. అటు తర్వాత ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. శీను స్నేహం వల్ల వినోద్‌కూ మంచితనం అలవడింది!



ఇక్బాల్

సేకరణ: జి.రవికిరణ్, అమరవాణి హైస్కూల్, కర్నూలు.

ఆ మధ్య 'ఇక్బాల్' అని ఒక మంచి సినిమా చూశాం (2005, దర్శకత్వం నగేష్ కుకునూర్). ఇప్పుడు అదే కథని- పాత్రలన్నిటి పేర్లూ మార్చేసి రవికిరణ్ రాసి పంపించాడు! 'ఏం చేయాలబ్బా?!' అని ఆలోచనలో పడ్డాం గానీ- చివరికి- "సరేలే, గొప్ప కథ గదా?" అని అచ్చు వేసేస్తున్నాం..

అనగనగా ఒక ఊళ్ళో ఒక మనోజ్ అనేవాడు ఉండేవాడు, అతనికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. వాళ్ళ నాన్నకు మాత్రం క్రికెట్ అంటే ఇష్టం లేదు. ఎందుకు కంటే అతను తాగుబోతు. మనోజ్ వాళ్ల నాన్న వాడికి ఎప్పుడూ ఏదో ఒక పని చెబుతూనే ఉండేవాడు. క్రికెట్ ఆడితే ఏమీ లాభం లేదనీ, దాని బదులు వేరే ఏ పని చేసుకున్నా హాయిగా బ్రతుక్కోవచ్చనీ ఆయన నమ్మకం. మనోజ్ క్రికెట్ పిచ్చిని వదిలించేందుకు ఆయన వాడికి గేదెలు కాసే పని పెట్టాడు.

మనోజ్ గేదెల్ని తోలుకొని అడవికి వెళ్లి, అక్కడ గేదెలు గడ్డిమేస్తాఉంటే తను కూర్చొని, ఒక చెక్కతో బ్యాటు చెక్కుకున్నాడు. తర్వాత వికెట్లు తయారు చేసుకున్నాడు. వాళ్ల ఇంటి వెనకాల చిన్న పూరి గుడిసె వేసుకొని, అందులో తన క్రికెట్ సామాన్లు పెట్టుకున్నాడు.

ఊళ్ళో కొందరు పిల్లలతో కలిసి, వాళ్ల నాన్నకు తెలీకుండా ఎప్పుడు వీలైతే అప్పుడు క్రికెట్ ఆడుకోవటం మొదలు-పెట్టాడు. ఆ ఊళ్లోనే ఒక వింత మనిషి ఉండేవాడు. అతను ఊళ్లో వాళ్లెవరితోటీ సరిగ్గా మాట్లాడేవాడు కాదు. అందరూ 'అతనికి తిక్క ' అని చెప్పుకునేవాళ్లు , కానీ నిజానికి అతను ఒక గొప్ప క్రికెట్ ప్లేయర్- చాలా ధనవంతుడు కూడాను.

పెద్దవాళ్లందరూ మోసం చేస్తున్నారని కోపం వచ్చి, అతను క్రికెట్ ఆడటం మానేసి, మనోజ్ వాళ్ల ఊరు చేరుకొని, మామూలు మనిషిలాగా బ్రతుకుతు-న్నాడు. మనోజ్ ఒకవైపున గేదెల్ని కాస్తూ, ఇంకో వైపున క్రికెట్ ఆడుకోవటం చూసి అతనికి మనోజ్ అంటే ఇష్టం ఏర్పడింది. ముందు కొన్ని సార్లు మనోజ్ ని పరీక్షించి చూసి, అతను వాడికి క్రికెట్ కోచింగ్ ఇవ్వటం మొదలుపెట్టాడు.

ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అతను ఎట్లా చెబితే అట్లా శ్రమపడి పనిచేశాడు, మనోజ్. చివరికి ఒక రోజున రంజీ ట్రోఫీ సెలక్షన్లు అవుతుంటే అతను మనోజ్ ను వెంట బెట్టుకొని వెళ్లాడు. వాటిలో మనోజ్ ఎంపిక అయిపోయాడు. ఇంత జరుగుతున్నా కూడా మనోజ్ వాళ్ల నాన్నకు సంగతులేవీ తెలీవు.

చివరికి పేపర్లో ఆ సంగతి వచ్చి, ఊళ్లో అందరూ మనోజ్ను మెచ్చుకోవటం మొదలు పెట్టే సరికి, వాళ్ల నాన్న కూడా వాడిని ప్రోత్సహించటం మొదలు పెట్టాడు. ఇట్లా అందరి సహకారంతో, తన సొంత పట్టుదలతో మనోజ్ ఇంటర్నేషనల్ క్రికెట్ ప్లేయర్ అయ్యాడు. పట్టుదల ఉంటే దేన్నైనా సాధించగలం.

సున్నిత హృదయులు



గతంలో ఇచ్చిన బొమ్మ "ఇక్కడ త్రవ్వండి" కి వచ్చిన స్పందన ఇది.

రచన: ఓరుగంటి లీలాకృష్ణ, 10 వ తరగతి, అమరవాణి హైస్కూల్, ఉయ్యూరు.

అది ఓరుగల్లు పట్టణం. అక్కడ నలుగురు పిల్లలు ఉండేవాళ్ళు. వాళ్ళంటే టీచర్లకు చాలా ఇష్టం. ఆ పిల్లలకు కూడానూ, టీచర్లంటే అంతే అభిమానం.

ఆ రోజున వాళ్ళకు ఒక పాఠాన్ని వివరిస్తూ టీచరుగారు చెప్పారు- "శాస్త్రవేత్తలు అందరూ చిన్నప్పటి నుండీ ఏదైనా ఒక విషయాన్ని పట్టుకొన్నారంటే చాలా సూక్ష్మంగా ఆలోచించి, దాన్ని సాధించేంత వరకూ పట్టు వదలరు" అని. ఈ మాటలు చాలా నచ్చి, వాళ్లు నలుగురూ వెంటనే శాస్త్రవేత్తలు కావాలని కలలు కనటం మొదలుపెట్టారు.

పట్టుదలగా గ్రంధాలయానికి వెళ్ళి, భూగోళ, ఖగోళ శాస్త్రాలలోని వింతలను దీక్షగా అధ్యయనం చేయటం మొదలు పెట్టారు. ఈ శాస్త్రాల అధ్యయనం వల్ల పిల్లలలో కొన్ని వింత ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. అవి వాళ్లని రాత్రుళ్ళలో కూడా వెంటాడాయి!



ఆ అమాయక పిల్లలు శాస్త్రజ్ఞుల లాగా ఏదో ఒకటి కనుగొనాలని ఆరాట పడ్డారు. తమ అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పిన పుక్కిటి పురాణాలన్నీ వాళ్ళిప్పుడు గుర్తుకు తెచ్చుకున్నారు. "వాళ్ల చిన్నప్పుడు- అంటే

40 సంవత్సరాల క్రితం- ఓరుగల్లు దగ్గర ఒక గ్రహ శకలం రాలిందట! అది ఒక చిట్టడవి అట! ఇప్పుడు ఆ చిట్టడవీ లేదు; ఎవ్వరూ ఆ గ్రహ శకలాన్ని గుర్తించినట్లు ఆనవాళ్ళు కూడా లేవు!

ఆ విషయం గుర్తొచ్చాక నలుగురు పిల్లలూ ఇక ఊరుకోలేక పోయారు. ఇంటి నుండి ప్రతి రోజూ స్కూలుకు వెళ్తున్నట్లుగా వెళ్ళి, ఓరుగల్లు పరిసర ప్రాంతాల్లో త్రవ్వకాలు మొదలు పెట్టారు. కానీ ఎక్కడా వాళ్లకి ఆ గ్రహశకలాల జాడ దొరక లేదు. పైపెచ్చు, వాళ్లు తవ్విన పరిసరాలలో పేరుకు పోయి ఉన్న వ్యాధి కారకాల వల్ల వాళ్ళ ఆరోగ్యం దెబ్బతిన్నది!

అంతలో పరీక్షలొచ్చేశాయి. పిల్లలు నలుగురూ పాఠాల పైన సరిగా మనసు పెట్టక పోవటం వల్ల, వాళ్లకు పరీక్షల్లో మంచి మార్కులూ రాలేదు! ఈ విషయం వాళ్ళ తాతగారికి తెలిసింది. ఆయన ఈ నలుగురు పిల్లలనూ పిలిచి, కూర్చోబెట్టుకొని "ఏం చేస్తున్నారు పిల్లలూ? ఏదో పరిశోధన చేస్తున్నట్లున్నారే, ఏంటి, చెప్పండి!" అని అడిగాడు. జరిగింది చెప్పారు వాళ్లు.



తాతగారికి తమ తప్పిదం అర్థమైంది. పిల్లలు నిద్రపోవడం కోసం చెప్పిన తూతూ మంత్రపు కథలు ఎంతకి దారితీసాయో తెలిసింది!

పిల్లల మనసులు సున్నితంగా ఉంటాయి. తమకు నచ్చిన పెద్దలు ఏం చెబితే అది వాళ్ల మనసుల్లో నాటుకు పోతుంది. అందుకని జాగ్రత్తగా ఉండాలి.



త్రాగుబోతు



రచన: జి.లోకనాథ్, 9 వతరగతి, ప్రకృతిబడి.

అనగనగా ఒక ఊరిలో రామయ్య అనే చిన్న రైతు ఒకడు ఉండేవాడు. రామయ్య భార్య సీతమ్మ. వాళ్ళకు ఒక కొడుకు.

వాళ్ల సంసారం అలా చల్లగా సాగుతున్న సమయంలో అకస్మాత్తుగా ఆ పిల్లవాడు అనారోగ్యానికి గురి అయ్యాడు, 'డాక్టర్ దగ్గరకు వెళ్దాం' అని సలహా ఇచ్చింది సీతమ్మ. కానీ రామయ్య మాత్రం తనకు తెలిసిన నాటు వైద్యం చేసి చూశాడు. పిల్లవాడి సమస్య తగ్గలేదు సరికదా, మరింత తీవ్రమైంది.

ఇక విధిలేని పరిస్థితులో ఇద్దరూ ఆ పిల్లవాడిని తీసుకొని బస్టాండ్‌కు పోయారు, కానీ ఎంత వేచి చూసినా ఒక్క బస్సూ

రాలేదు. "ఆ రోజు ఇక బస్సులు రావు, బంద్" అనిచెప్పారు అందరూ. ఆ మాటలకు దంపతులిద్దరికీ ఏడుపు వచ్చేసింది. సరైన వైద్యం దొరక్క వాళ్ల కొడుకు చనిపోయాడు!



తల్లి తండ్రులు ఆ పిల్లవాడిని మరచిపోవడమే లేదు. అన్నం తిన్నప్పుడల్లా కొడుకు గుర్తుకు వస్తున్నాడు- అలా రోజులు గడిచాయి. ఒక రోజున రామయ్య పొలానికి వెళ్ళి, మంచం వేసుకొని నిదుర పోదామని అనుకున్నాడు. కానీ కళ్ళు మూసుకుంటానే కొడుకు గుర్తుకు వచ్చాడు.

అప్పుడు 'కాటమయ్య' అనే పనికిమాలిన వెధవ ఒకడు అతని దగ్గరకు వచ్చి"రామయ్యా! చనిపోయిన వాడు తిరిగి వెనక్కి రాడు. కానీ నువ్వు- ఇదిగో, ఈ బ్రాందీ త్రాగు- నీ పిల్లవాడు అసలు గుర్తుకే రాడు!" అని చెప్పాడు.

రామయ్య ముందు వద్దన్నాడు. కానీ వాడు 'ఇదిగో, ఈ కొద్దిగా త్రాగు- చాలు" అని బలవంతంగా కొంచెం త్రాగించాడు. పైగా ఒక కోటర్ చిన్న సీసాడు సారాయి అక్కడ పెట్టి మరీ పోయాడు. సారాయి తాగే సరికి రామయ్యకు ఆలోచన మందగించి, బాగా నిద్రపట్టింది- ఇక ఆ తర్వాత అతనికి కూడా ఆ త్రాగుడు రోగం అంటుకున్నది.

ఇప్పుడు రామయ్య ప్రతి రోజూ విపరీతంగా త్రాగుతున్నాడు. ఎప్పుడూ మత్తులోనే ఉంటున్నాడు. త్రాగకుండా ఉండలేని పరిస్థితి! తన త్రాగుడుకు ఉన్న ఆస్తి అంతా ఖాళీ చేశాడు. సీతమ్మ మనసు చంపుకొని బ్రతికేందుకు ప్రయత్నించింది, కానీ ఎన్నాళ్లు? చివరికి ఆమె బలహీనురాలై, చనిపోయింది.

అయినా రామయ్యకి బుద్ధి రాలేదు. భార్య-పిల్లలు గుర్తు రాకూడదని అతను ఇంకా చాలా సారాయి తాగాడు- ఊళ్లు పట్టుకొని తిరిగాడు. ఒక రోజున రామయ్య అటూ, ఇటూ ఊగుకుంటూ పోయి ఒక గుంతలో పడిపోయాడు. అక్కడే కట్టెలు కొడుతున్న ఒక మంచి మనిషి చూసాడు అతన్ని. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాడు.



అక్కడ రామయ్యను పరీక్ష చేసి, "కాలేయం అంతా పాడైపోయింది "అని చెప్పారు డాక్టర్లు . "ఇంక మేము ఏమీ చెయ్యలేం" అన్నారు వాళ్లు.

భార్య-కొడుకు గుర్తుకొచ్చిన రామయ్య నిరాశచెందాడు: "నన్ను చనిపోనివ్వండి" అని ప్రాణభీతితో ఏడవటం మొదలుపెట్టాడు.

అతనిని కాపాడిన మంచి మనిషి అతనికి ధైర్యం చెప్పి, తనకు తెలిసిన ఆయుర్వేద డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాడు అతన్ని, ఆ డాక్టర్ గారు రామయ్యకు రకరకాల మూలికలతో వైద్యం చేశారు; ధ్యానం కూడా నేర్పారు. వాటన్నిటి మూలంగా రామయ్య ఆరోగ్యం క్రమంగా మెరుగైంది.



అప్పటి నుంచి రామయ్య మత్తుపానీయాలు త్రాగడం మానేశాడు. తను త్రాగకపోవటమే కాదు; ఇతరులకు కూడా "త్రాగద్దు బాబులూ!" అని చెప్పటం మొదలెట్టాడు !



కళ్ళు - నోరు ఉన్న ఉత్తరం



రచన: పి.రవ్య, ప్రకృతిబడి, 8 వతరగతి.

ఒక ఊరిలో రామయ్య అనే భూస్వామి ఉండేవాడు. అతనికి ఒక కూతురు. రామయ్య ఆమెను ప్రక్క ఊరిలోఉండే తన స్నేహితుడి కొడుక్కే ఇచ్చి పెళ్ళి చేశాడు. ఇంట్లో రామయ్య దగ్గర రాజశేఖర్ అనే పనివాడు మాత్రం ఉండేవాడు. అతను పని బాగా చేస్తాడు; కానీ ఒక్క అక్షరం ముక్క రాదు.

ఒకరోజు రాజశేఖర్‌ను పిలిచి "ఈ మామిడి పండ్లు తీసుకెళ్ళి పక్క ఊర్లో ఉన్న అమ్మాయిగారికి ఇచ్చిరా!" అని చెప్పాడు రామయ్య.

రాజశేఖర్ సరేనని బయలుదేరి, "అమ్మాయిగారితో ఏమన్నా చెప్పాలా,

బాబుగారూ?" అని అడిగాడు. "నువ్వేమీ చెప్పద్దులే, అన్నీ ఈ ఉత్తరమే చెబుతుంది" అని ఒక ఉత్తరం రాసి, చేతికిచ్చాడు రామయ్య- "దీన్ని అమ్మాయి చేతికి ఇవ్వు- చాలు" అన్నాడు.

అలాగేనని, రాజశేఖర్ మామిడి పండ్ల గంపని నెత్తికి ఎత్తుకొని పక్క ఊరికి నడక సాగించాడు. నడుస్తూనే ఉన్నాడు; కానీ అతనికి రామయ్య మాటలే గుర్తుకు వస్తున్నాయి మళ్ళీ మళ్ళీ: "ఉత్తరం అమ్మాయిగారితో ఎట్లా చెబుతుందబ్బా?" అని చాలా ఆలోచించాడు; కానీ అతనికి ఏమీ బోధపడలేదు.

అట్లా నడుస్తూ పోతుంటే, సగం దూరం వెళ్ళేసరికి అతనికి ఆకలయ్యింది: "మామిడి పళ్ళు బుట్టనిండా ఉన్నాయి; కానీ ఏం లాభం? తిన్నానంటే ఈ ఉత్తరం చూసి అమ్మాయి గారితో చెబుతుంది" అనుకున్నాడు. "ఈ ఉత్తరానికి తెలీకుండా ఆకలి తీర్చుకునేది ఎట్లాగబ్బా?" అని ఆలోచించసాగాడు.

అతనికి ఒక ఉపాయం తట్టింది. అదేమిటంటే, "ముందుగా ఉత్తరాన్ని గుంత తవ్వి పూడ్చి పెట్టేయాలి- అప్పుడు ఉత్తరం ఏమీ చూడలేదు కదా? అందుకని ఎన్ని కావాలంటే అన్ని మామిడిపళ్ళు తీసుకొని తినేయచ్చు. ఆ తర్వాత మళ్ళీ ఉత్తరాన్ని బయటికి తీసి, దులిపి మామూలుగానే తీసుకు పోవచ్చు!" అనుకున్నాడు. తనకు ఇంత తెలివైన బుర్ర ఉన్నందుకు చాలా సంతోషపడ్డాడు.



వెంటనే ఉత్తరాన్ని పూడ్చిపెట్టేసి, కొన్ని మామిడి పండ్లు తినేశాడు. మామిడి పండ్లు తిన్నాక ఆ ఉత్తరాన్ని తీసి "ఇప్పుడు నువ్వేమీ చెప్పలేవులే, అమ్మాయి గారితో"

అన్నాడు; మళ్ళీ నడక సాగించాడు.

మెల్లగా అమ్మాయి గారి ఊరికి చేరుకున్నాడు. అమ్మాయి గారి ఇంటికి వెళ్ళి ఆ పండ్ల గంపను, ఉత్తరాన్ని అందించాడు. ఆమె ఉత్తరం తీసి చదివి, గంపలోని మామిడి పండ్లు లెక్కచూసుకొని, "పండ్లు తిన్నావు కదూ?" అని అడిగింది. "లేదు అమ్మాయి గారూ" అన్నాడు రాజశేఖర్ కలవరపడుతూ. "నిజం చెప్పు" అన్నది ఆమె. ఇక రాజశేఖర్‌కు నిజం ఒప్పుకోక తప్పలేదు. అతని అమాయకత్వాన్ని చూసి అమ్మాయి కూడా నవ్వింది.

ఇక అతన్ని తిరిగి వాళ్ళ నాన్నగారి ఊరికి పంపించింది- వేరే ఏవో సామాన్లిచ్చి. దారిలో వెళ్ళేటప్పుడంతా రాజశేఖర్ ఒకటే ఆలోచించాడు- "ఉత్తరం ఎట్లా చూసింది? అమ్మాయిగారికి ఎట్లా చెప్పింది?" అని. ఎంత ఆలోచించినా ఆ సంగతి ఇప్పటికీ అతనికి అర్థం కాలేదు!

బాల రచనలకు ఆహ్వానం!

మీరూ కథ రాశారా? మీరూ పాటలు పాడారా? మీకు చాలా జోకులు వచ్చా? కార్టూన్లూ, బొమ్మలూ గీస్తారా? మీ సృజనల్ని మాకు పంపండి. బాగున్నవాటిని కొత్తపల్లిలో ప్రచురిస్తాం.

మా చిరునామా: కొత్తపల్లి, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, 515101



వివేక చంద్రుని కథ



రచన: కె.భార్గవి, టింబక్టు బడి.

అనగా అనగా చాలా కాలం క్రితం మాల్యవంతం అనే రాజ్యాన్ని చక్కని రాజు ఒకడు పరిపాలించేవాడు. అతనికి తగినట్లే ఉండేది, అతని భార్య. సీతారాముల-లాంటి దాంపత్యం వారిది; కానీ వాళ్లిద్దరికీ ఒకటే చింత- సంతానం లేదు.

పిల్లల కోసం రాజు- రాణి నోమని వ్రతం లేదు; చేయని పూజా లేదు. వారి ప్రార్థనలు ఫలించినట్లు, చివరికి రాణికి చందమామ లాంటి కుమార్తె పుట్టింది. ఆమె పుట్టిన రోజును రాజ్య ప్రజలందరూ ఒక పండుగలాగా జరుపుకున్నారు.

రాజు రాణి ఆ పాపకు 'లలిత ప్రియ' అని పేరుపెట్టారు. ఒక్కగానొక్క కూతురు-

కాబట్టి వాళ్లు ఆమె ఏది కోరితే అది ఇచ్చారు; అన్ని విద్యలూ నేర్పారు,; కంటికి రెప్పలాగా చూసుకున్నారు.

ఇప్పుడు ఆ పాపకు యుక్త వయస్సు వచ్చింది, సౌందర్యంలో అప్సరసలను తలదన్నేది ఆమె. రాజు, రాణి ఆమెకిక వివాహం చేయాలని సంకల్పించి, తగిన వరుడి కోసం వెతకసాగారు.

ఒకనాడు, యువరాణి లలితప్రియ ఉద్యానవనంలో తన చెలికత్తెలతో ఆడుకుంటున్న వేళ- ఉన్నట్లుండి మేఘాలు క్రమ్ముకున్నాయి! పెను తుఫానులాగా గాలి చెలరేగింది- వాయు గుండం ఒకటి ఏర్పడి, వాళ్ళు ఆడుకుంటున్న తోట చుట్టూ క్రమ్ముకున్నది!

దాని అనంతరం చూస్తే యువరాణి మాయం! చెలికత్తెలందరూ హాహాకారాలు చేశారు. "నా కుమార్తెను నా ముందుకు తేవాలి" అని ఏడుస్తూ మూర్ఛపోయింది రాణి. రాజ్యంలోని ప్రముఖులు అందరూ ఎవరికి వాళ్ళు తలా ఒక దిక్కునా వెతికారు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి కానీ యువరాణి జాడ మాత్రం దొరకలేదు!

చివరికి రాజు గారు దండోరా వేయించారు: "ఎవరైతే నా కుమార్తెను నాకు తెచ్చి ఇస్తారో వాళ్ళకు నా రాజ్యం అంతా ఇచ్చేస్తాను. నా కుమార్తెను కూడా వారికే ఇచ్చి వివాహం జరిపిస్తాను" అని. రాకుమార్తె అందం గురించి తెలిసిన క్షత్రియ యువకులు అనేక మంది దేశ విదేశాల నుండి వచ్చి యువరాణి కోసం వెతికారు. ఎవరెంత వెతికినా యువరాణి జాడ మాత్రం అంతు చిక్కలేదు.

వచ్చిన వారిలో కొందరు వెతికి-వెతికి వేసారి తమ తమ రాజ్యాలకు వెళ్లి-పోయారు. మరి కొందరు పూర్తిగా అదృశ్యమే అయిపోయారు. చివరికి ఇక ఎవ్వరూ ముందుకు రావటమే మానివేశారు. రాజు-రాణిల విచారానికి

మేరలేదు.

అదే రాజ్యంలో నివసించేవాడు, వివేక చంద్రుడనే నిరుద్యోగ యువకుడు. యుద్ధ విద్యలు బాగానే వచ్చినా, ఉద్యోగం మాత్రం ఏదీ రాలేదు. చివరికి అతను మాత్రం ముందుకు వచ్చాడు, యువరాణిని వెతికేందుకు.



రాజ్యంలోని ప్రజలందరూ అతనిని చూసి నవ్వసాగారు కానీ, అతను మాత్రం ధైర్యంగా పోయి రాజు గారి ముందు నిలబడ్డాడు. అప్పుడు రాజు ఇలా అన్నాడు, "ఇంత మంది వీరులు, శూరులైన యువ రాజులు చేయలేని పనిని సామాన్యుడివి, నిరుద్యోగివి, నువ్వెలా చేయగలవు? అయినా ఏ పుట్టలో ఏమున్నదో? కానివ్వు" అని చెప్పి, అతనికి కావలసిన సామగ్రి అంతా తయారు చేసి ఇచ్చి, వీడ్కోలు పలికాడు. వివేక చంద్రుడు బయలు దేరి దక్షిణ దిశగా పోసాగాడు. అలా పోయి పోయి చాలా అడవులను, కొండలను, సరస్సులను దాటి పట్టుదలతో ముందుకు సాగాడు.

అట్లా పోతూ ఉంటే వివేకచంద్రుడికి ఒక కొలను ప్రక్కన ఏడుస్తూ కనబడింది ఒక హంస. అతను దాన్ని పలకరించి, "మామూలుగా హంసలన్నీ కలిసి జట్టుగా ఉంటాయి కదా, నువ్వెందుకమ్మా, ఒక్కదానివే ఉన్నావు?" అని అడిగాడు. "మా అమ్మావాళ్లంతా నన్ను వదిలేసి దూరంగా ఆ కొండల అవతల ఉన్న సరస్సుకు ఎగిరిపోయారు. నా కాలుకి దెబ్బతగిలింది. నేను అక్కడికి ఎగరలేను" అని ఏడిచింది హంస. వివేకచంద్రుడు

దాన్ని ఎత్తుకొని తీసికెళ్ళి, మిగిలిన హంసలతో కలిపాడు దాన్ని.

అవన్నీ సంతోషించి "నువ్వెందుకు, ఈ అడవుల్లో తిరుగుతున్నావు?” అని అడిగాయి. రాకుమార్తె అదృశ్యం గురించి చెప్పిన మీదట, అవి "ఓహో! వాత-రాక్షసుడి పనే ఇది! వాడుండేది ఇక్కడికి దగ్గర్లోనే. కొంత ముందుకి పోయావంటే ఒక పెద్ద మర్రిచెట్టు కనబడుతుంది. దాని ముందు నిలబడి నువ్వు ఈ మంత్రం చదివి "తెరుచుకో" అనాలి. అప్పుడు ఆ చెట్టు తెరచుకొని అక్కడో దారి ఏర్పడుతుంది. అదే వాతరాక్షసుడి ఇల్లు! కానీ జాగ్రత్త! వాడు చాలా భయంకరుడు!" అని చెప్పాయి.

వివేకచంద్రుడు అవి చెప్పిన విధంగానే పోయి, చివరికి ఇంద్రభవనం లాంటి ఒక ఇంటిని చేరుకున్నాడు. అక్కడ ప్రతి వస్తువూ వింత వింతగానే ఉన్నది. అలా లోపలికిపోయాడు- అక్కడ అతనికి ఒక కాళీమాత విగ్రహం కనిపించింది. దానికి రోజూ పూజలు జరుపుతున్నట్లు గుర్తులు కనబడ్డాయి.

మెల్లగా ఆ భవనంలోని గదులన్నిటినీ చూస్తూ పోయాడు వివేకచంద్రుడు. అక్కడ ఒక గదిలో వివిధ దేశాల యువరాణులు కనబడ్డారు. "వాళ్ళలో తమ యువరాణిని గుర్తుపట్టడం చాలా కష్టం" అనుకున్నాడు అతను! కానీ వాళ్ళందరిలోకీ అందంగా ఉన్న యువరాణి దగ్గరికి వెళ్ళి అడిగితే ఆమే అని తెలిసింది!

అంతలో అతనికి బయట నుండి అడుగుల శబ్దం వినబడింది. వెంటనే అతను పరుగున వెళ్ళి ఓ మూలన దాక్కొని చూశాడు.

ఆ వచ్చింది వాతరాక్షసుడే! వాడు నేరుగా లోపలికి వచ్చి యువరాణి దగ్గరికి పోయి ఆమెతో "నువ్వుగనక నన్ను పెళ్లాడితే ఈ ప్రపంచమంతా నా గుప్పిటిలో ఉంటుంది, అప్పుడు నీకు ఏ లోటూ లేకుండా చూసుకొంటాను. నువ్వెందుకు

నన్ను కాదంటున్నావు?" అని ప్రాధేయ పడ్డాడు.


వాతరాక్షసుడికేసి చూస్తూ యువరాణి "నీ వికార రూపం, నీ దుశ్చేష్టలు- రెండూ నాకు అసహ్యం కలిగిస్తున్నాయి. ఇంత మందిని బంధించిన నీకు చాలా పాపం వస్తుంది. నీ చావు దగ్గర పడుతున్నట్లున్నది. అందుకే ఇలా ప్రవర్తిస్తున్నావు" అన్నది.

వాతరాక్షసుడు పెద్దగా నవ్వి "నన్నెవ్వరూ ఏమీ చెయ్యలేరు. పున్నమి రోజున కొలనులో స్నానానికి వచ్చిన హంసలన్నీ తాము తెచ్చుకున్న హారాలను ఒకచోట వదిలి వెళ్లి, స్నానం చేసి తిరిగి వస్తాయి. వాటిలో ఒక విచిత్ర హంస వదిలిన హారాన్ని తీసుకొచ్చి, ఈ కాళీమాత మెడలో వేస్తే తప్ప, నేను నశించను. అయినప్పటికీ ఆ పని చేసిన వాడు అంతకంత అనుభవిస్తాడు- నా యీ వికారరూపాన్ని వాడు ధరించాల్సి ఉంటుంది! అంత పని ఎవ్వరూ చెయ్యరు! కనుక నాకిక చావే లేదు! ఇంకా నీకు రెండు నెలల సమయం ఇస్తాను. ఆలోగా నువ్వు నా దారికి రాకపోతే నిన్నూ తినేస్తాను- నీ ఇష్టం!" అని బెదిరించి వాడు ఎక్కడికో వెళ్లిపోయాడు.

చాటు నుండి అంతా విన్న వివేకచంద్రుడు బయటికి వచ్చి, యువరాణికి ధైర్యం చెప్పాడు. తను వెళ్లి హారం తెస్తాననీ, ఓపికతో వేచి ఉండమనీ చెప్పాడు. "కానీ వికార రూపం?" అని బాధపడింది యువరాణి. "ఏమీ పరవాలేదు, ఆ సంగతి మళ్లీ చూద్దాం" అని వివేకచంద్రుడు మళ్లీ హంసల దగ్గరికి వెళ్లాడు. అతను హంసలున్న చెరువును చేరుకునే సరికి సాయంత్రం అవుతున్నది.

పున్నమి చందమామ అప్పుడప్పుడే బయటికి వస్తున్నాడు, ప్రతి హంస ముక్కునా ఒక హారం వ్రేలాడుతున్నది. చూస్తే అన్నీ ఒకేలాగా ఉన్నాయి, అంతలో అక్కడ ఒక విచిత్రం జరిగింది! అన్ని

హంసలూ హారాలను ఒకచోట వదిలి వెళ్ళిపోసాగాయి! చివరికి ఒక అందమైన హంస మాత్రం అక్కడే ఆగింది, అన్నీ వెళ్ళిపోయిన తర్వాత ఆ హారాన్ని తెచ్చి వివేకచంద్రుడికి ఇచ్చి ఎగిరిపోయింది! అతను కాపాడిన హంసే, అది!



వివేకచంద్రుడు ఆ హారాన్ని తీసుకెళ్లి ఇక్కడ కాళీమాత మెడలో వేశాడో లేదో, అక్కడ రాక్షసుడు పెడబొబ్బలు పెడుతూ మండి బూడిద ఐపోయాడు. అదే క్షణంలో వాడి వికారరూపం కాస్తా వివేకచంద్రుడికి వచ్చేసింది! స్వేచ్ఛ పొందిన యువతులందరూ యువరాణికి, వివేకచంద్రుడికి ధన్యవాదాలు చెప్పి ఎవరి దారిన వాళ్లు వెళ్లారు. యువరాణి, వివేకచంద్రుడు తమ రాజ్యం చేరుకున్నారు. అయితే సమస్య తీరలేదు:

"నువ్వెవరో నాకు తెలీదు, నువ్వు యువరాణిని కాపాడావంటే నాకు నమ్మకం కుదరట్లేదు" అంటూ మనసుకు నొప్పి కలిగించేలా మాట్లాడారు రాజుగారు. అయినా యువరాణి, తండ్రిని వారించింది. పూలమాలను తీసుకొని, వికారంగా ఉన్న వివేకచంద్రుడినే వరించింది. అంతే! వివేకచంద్రునికి పూర్వరూపం తిరిగి వచ్చేసింది! యువరాణి ప్రేమ వల్ల రాక్షసుడి వికార రూపపు పొరలన్నీ తొలగి పోయాయి. రాజుగారు క్షమాపణ చెప్పి తన కుమార్తెను వివేకచంద్రుడికి ఇచ్చి వైభవంగా వివాహం జరిపించారు!



బంగారు విగ్రహం

యోగి కథ-2

రచన: E.యోగేశ్వరరెడ్డి, VII Rose, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, విజయవాడ-77.

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం పేరు వైశాలి. ఆ రాజ్యాన్ని ఒక రాజు పరిపాలిస్తున్నాడు. ఆ రాజుకి ఒక కూతురు ఉంది. ఆమె అంటే ఆయనకు ప్రాణం. అయినా ఏం చేస్తాం, ఒక రోడ్డు ప్రమాదంలో ఆయన కూతురు మరణించింది.

తన కూతురి గుర్తుగా ఆయన ఒక బంగారు విగ్రహం తయారు చేయించాడు. కొంత మంది గజదొంగలకు ఆ విషయం తెలిసింది. ఎలాగైనా దాన్ని దొంగిలించాల-నుకున్నారు వాళ్ళు. ఆ రోజు రాత్రి ధైర్యంగా రాజభవనంలోకే ప్రవేశించారు. దొంగలు రావచ్చుని కూడా ఊహించని రాజభవనం అంతా నిద్రలో మునిగి తేలుతున్నది. దొంగలు బంగారు విగ్రహం

కోసం మెల్లగా కోటలో అంతా వెతికారు.

చివరికి అది రాజుగారి గదిలో కనిపించింది. "ఎన్నడూ చూడనంత బంగారం చూశాం" అనుకొని, వాళ్లు ఆ విగ్రహాన్ని ఎవ్వరికీ తెలియకుండా, చప్పుడు చేయకుండా, ఎత్తుకొని పోయారు- వాళ్ళ స్థావరానికి. రాజుగారు ఉదయానే లేచి చూస్తే ఏముంది? తన కూతురు బంగారు విగ్రహం మాయం!

రాజుగారికి ఏం చేయాలో తెలీలేదు. ఆస్థానంలోని మంత్రులను అందరినీ అత్యవసరంగా పిలిపించారు. తన కూతురు బంగారు విగ్రహాన్ని ఎత్తుకెళ్ళిన దొంగలను పట్టుకొమ్మని ఆజ్ఞాపించారు. మంత్రులందరూ తమ తమ పరిధుల్లో మనుషుల్ని వినియోగించి వెతికించారు- ఫలితం మాత్రం శూన్యం! బంగారు విగ్రహం నిజంగా మాయమే అయిపోయింది!

వాళ్లలో ఒక మంత్రి చాలా తెలివైన వాడు. ఆలోచించగా అతనికి ఒక ఉపాయం తట్టింది. దాన్నే రాజు గారికి చెప్పాడు; రాజు గారికి ఆ ఉపాయం నచ్చింది. దాన్ని పాటిస్తూ ఆయన మరొక బంగారు విగ్రహం తయారు చేయించారు. ఆ విగ్రహాన్ని గురించి ఘనంగా చాటింపు కూడా వేయించారు: "అది ముందుసారి విగ్రహం కంటే పెద్దది, ఇంకా ఖరీదైనది" అని చెప్పించారు. దాన్ని గురించి విన్న దొంగలకు మళ్ళీ ఆశపుట్టింది. "ఆ విగ్రహాన్ని కూడా దొంగిలించేద్దాం" అనుకున్నారు వాళ్ళు. ఏమాత్రం బెరుకూ లేకుండా వాళ్ళు మళ్ళీ ఒకరోజు రాత్రి రాజభవనంలోకి ప్రవేశించారు.

బంగారు విగ్రహం కోసం వెతుకుతూ వాళ్ళు మళ్ళీ రాజుగారి గదిలోకి వెళ్ళారు. కొత్త బంగారు విగ్రహం అక్కడే ఉంది- ఇదివరకటికంటే పెద్దదిగా; అందంగా. 'ఇంక దానినిఎత్తుకెళ్దాం' అని చేయి పెట్టారో లేదో- రాజభటులు పరుగున వచ్చి వాళ్ళని బంధించారు. రాజుకు మొదటి బంగారు

విగ్రహం కూడా లభించింది; దొంగలకి కఠినమైన శిక్ష లభించింది; చక్కని ఉపాయం చెప్పిన మంత్రికి ఇంటి నిండా బహుమతులు లభించాయి!

నా మాతృభూమి

కవిత

విత్తనం కంటే మొక్క గొప్పది
మొక్క కంటే విత్తనం గొప్పది
మొక్కకు లవణాలిచ్చే భూమి గొప్ప
ఆ భూమిని సాగు చేసే రైతు గొప్ప
మనకు చదువు చెప్పే ఉపాధ్యాయుడు గొప్ప
మనల్ని కనిపెంచిన తల్లిదండ్రులు గొప్ప
అందరికన్నా మనకు కడవరకూ తోడున్న కన్నభూమి గొప్ప!

రచన: జి.వెంకటరావు, 9వ తరగతి, నందన గ్రామీణ హైస్కూలు, చేతన, చౌడవరం, గుంటూరు



శ్రమ విలువ



శ్రమపడి సంపాదించుకున్నది ఏదైనా ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. పెద్దయినాక రోగాలు పోగొట్టుకోవటం కోసం వ్యాయామం చేసి శ్రమపడేది కొందరైతే, చిన్నప్పటినుండే పూట గడవక శ్రమపడేవాళ్ళు మరికొందరు. ఏది ఏమైనా శ్రమదే గెలుపు! ఈ విజయగాథ ఎలా ఉందో చెప్పండి.

రచన: కె.గంగమ్మ, ఉపాధ్యాయురాలు, టింబక్టు బడి.

ఉదయభానుడి లేలేత కిరణాలు మీద పడటంతో రాములమ్మ చిరుగుల దుప్పటిని ప్రక్కకు లాగి దిగ్గున లేచి కూర్చుంది. వయసు పైబడిన అవ్వ రోజూ కేకలు వేసి లేపుతుంది- చిన్న రాములమ్మను. ఆ రోజు అవ్వ లేవలేదు- 'నా అన్నవాళ్ళు ఎవ్వరూ లేని రాములమ్మకు ఉన్న ఆ ఒక్క ఆధారం కూడా పోయింది- అవ్వ చనిపోయింది.

తను రోజూ పని చేసే దుకాణం

యజమాని 'సేఠ్' దగ్గరకు వెళ్ళింది రాములమ్మ. బిక్కు బిక్కుమంటూ, ఉన్న విషయం చెప్పింది. ఆయనా, ఆయన భార్యా రాములమ్మను ఓదార్చారు- మిగిలిన తతంగమంతా పూర్తి చేశారు. తరువాతి రోజు నుండి రాములమ్మ దినచర్య మారిపోయింది. ఉదయం సేఠ్ భార్యకు ఇంటి పనులలో సాయం చేయటం, తరువాత సేఠ్ దగ్గర అంగట్లో సరుకులు అందించటం- ఇలా పని బరువుగా సాగింది.

కొద్ది రోజుల తర్వాత రాములమ్మ అంగడి దగ్గరకు వెళ్ళింది. అప్పుడే సేఠ్, సేఠ్ భార్య ప్రయాణమయ్యి రాములమ్మ కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. రాములమ్మ రాగానే 10 రూపాయలు చేతిలో పెట్టి "మేము తిరుపతికి బయలదేరుతున్నాము. తిరిగి వచ్చేందుకు మూడు రోజులు పడుతుంది. అంత వరకు ఈ సరుకులు తీసుకొని వాడుకో" అని చెప్పి బయలు దేరి వెళ్లారు.

ఆ మూడు రోజులూ ఏం చేయాలో అర్థం కాలేదు రాములమ్మకి, ఉదయమే లేచింది, తమ వీధిలో పశువులు వేసిన పేడనంతా సేకరించింది. తరువాత వంట చేసుకొని తిన్నది. సాయంకాలం కూడా పొద్దుపోలేదు- మళ్ళీ వీధంతా తిరిగింది. పేడనంతా పోగు చేసి తన గుడిసె ముందు వేసింది. ఇలా రోజూ ఉదయం, సాయంత్రం... మెల్లగా ఇది ఒక అలవాటుగా మారిపోయింది. ఇప్పుడు రోజు ఉదయం, సాయంత్రం ఈ పని ముగించుకొని, తరువాతే సేఠ్ దగ్గర పనికి వెళ్ళేది.


ఇలా సంవత్సరం పొడవునా పోగు

చేసిన పేడ దాదాపు 20 బండ్లు అయింది. ఇంతలో శరత్కాలం వచ్చింది. చేన్లకి ఎరువులు తోలడం మొదలు పెట్టారు రైతులు. రైతులందరి కన్నూ రాములమ్మ గుడిసె ముందు ఉన్న పేడ దిబ్బ మీదే! మెత్తటి పేడకల్లు చూసి రైతులంతా ఆ ఎరువును కొనాలనుకున్నారు. ఈ వ్యవహారం అంతా సేఠ్ దగ్గరకు పోయింది. సేఠ్ ఒక రైతుతో మాట్లాడి, బండి ఎరువుకు 200 రూ/- చొప్పున మొత్తం నాలుగు వేల రూపాయలు రాములమ్మ చేతిలో పెట్టాడు.

ఒక్క సారిగా చేతిలోకి వచ్చిన నాలుగు వేల రూపాయల్ని చూసి రాములమ్మకి నోటమాట రాలేదు. ఆ డబ్బును తీసుకొని, సేఠ్ భార్య సహాయంతో బ్యాంక్‌లో దాచుకున్నది. తన దగ్గర మిగిలిన 10 రూపాయలతో చక్కెర బిళ్ళలు కొని వీధిలోని పిల్లలందరికీ పంచింది. ఇప్పుడు రాములమ్మ తన ఖాళీ సమయాన్నంతా పేడను ప్రోగు చేయడం కోసమే వెచ్చించింది. వీధిలో పిల్లలు కూడా ఆమెకి పేడ ఎత్తడంలో సాయం చేశారు. అలా రాములమ్మ పిల్లల సాయంతో చాలా పేడ పోగు చేసింది. సేఠ్ దగ్గర పనికి కూడా క్రమం తప్పకుండా వెళ్ళేది; వాళ్ళు ఆమెను బాగా ఆదరించేవాళ్ళు- తమవంతు సాయం చేసేవాళ్లు.

మరుసటి సంవత్సరం రాములమ్మ ఎరువుకు మును పటి ఏడాది కంటే మూడింతలు లాభం వచ్చింది. ఈ డబ్బు మొత్తం ఆమె బ్యాంకు ఎకౌంటులో జమైంది. ఇలా ఆమె పేరిట బ్యాంకులో మొత్తం లక్షరూపాయల వరకు సొమ్ము జమైంది.

అయితే ఒక సంవత్సరం తీర్థయాత్రలకు బయలు దేరిన సేఠ్ దంపతులు ఆకస్మికంగా రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఉన్న అంగడిని, ఇల్లును బంధువులు లాక్కొని పోయారు, రాములమ్మ భోరున

ఏడ్చింది. అయినా ధైర్యం కూడ గట్టుకొని, తను దాచుకొన్న సొమ్ముతో సొంతంగా చిల్లర దుకాణం ఒకటి మొదలుపెట్టింది. పేడను సేకరించే పనిని కూడా క్రమం తప్పకుండా కొనసాగించింది. అయితే సేఠ్ దగ్గర నేర్చుకున్న వ్యాపార మెళకువలతో వ్యాపారాన్ని కూడా చక్కగా నడిపింది.

రానురాను రాములమ్మ అంగడిలో వచ్చే ఆదాయం కూడా బాగా పెరిగింది. చాలా మంది పిల్లలు ఆమెకు స్నేహితులయ్యారు.

జీవనానికి లోటు లేదు- సమాజం నుంచి చాలా మంచి విషయాలు తెలుసుకున్నది- మంచి, చెడు అర్థం చేసుకున్నది- కష్టం యొక్క విలువను, అందులోని ఆనందాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నది.



ఇప్పుడు రాములమ్మ ఊళ్లో అందరి కంటే ధనవంతురాలు. చాలా మంది పేద పిల్లలకు చదువుకోవడానికి సాయం చేస్తుంది. ఊరందరికీ తలలో నాలుకలా మెసలుతున్నది- కానీ పేదరికంలో కష్టాన్ని మాత్రం ఏ రోజూ మరిచి పోలేదు. రాములమ్మ నీడలో చాలా మంది పేద పిల్లలు, ముసలి వాళ్ళు ఆశ్రయం పొందుతున్నారు, శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది ఆమె.

ఎంత?

రచన: మంగాదేవి, వెంకటేశ్వర బాలకుటీర్, గుంటూరు.

"అమ్మా!"

"ఏం తల్లీ?"

"నేనంటే నీకిష్ట మేనా!"

"ఎంతో ఇష్టం కన్నా!"

"ఎంతిష్టం!"

"మబ్బంత!"

"ఇంకా!"

"అదిగో! ఆ కొండంత!

"ఇంకా?"

"ఆ చెట్టంత!"

"ఇంకా!"

"ఈ నేలంత!"

"ఇంకా?"

"సముద్రమంత!"

"మరి నన్నెందుకు ఇంట్లో ఉండకుండా బడికి పంపిస్తావు?"

"చక్కగా చదువుకోవాలిరా కన్నా!"

"చదువుకుంటే మంచి మంచి పుస్తకాలు చదువుకోవచ్చు!"

"పుస్తకాలు చదువుకుంటే!"

"చాలా సంగతులు తెలుస్తాయి!"

"తెలిస్తే!"

"మంచి పనులేంటో చెడ్డ పనులేవిటో తెలుస్తాయి!"

"తెలుసుకుని?!"

"మంచి పనులు చేస్తూ మబ్బంత అయిపోవచ్చు!"

"మబ్బంత అయితే!"

"చక్కగా అందరికీ నీళ్ళివ్వచ్చు!"

"మరి కొండంత అయితే ?"

"కొండ కూడా మంచి పనులే చేస్తుంది. ఆవులకు, మేకలకు మేతిస్తుంది కదా!"

"మరి నేలయితేనో?"

"మనందరికీ అన్నం పెట్టేది నేలే కదా!"

"చెట్టంత అయితే?"

"బోల్డన్ని కాయలూ, పళ్ళూ ఇవ్వచ్చు!"

"మరి సముద్రమయితే?"

"నీళ్ళల్లో ఉండే జంతువులన్నిటికీ ఇల్లు సముద్రమే కదరా!"

"అయితే నేను కూడా బాగా చదువుకుంటానమ్మా! మంచి మంచి పనులు చేస్తా! మబ్బులాగ, కొండలాగ, చెట్టు లాగ, నేల లాగ, సముద్రం లాగ అందరికీ సాయం చేస్తా!"

"బై అమ్మా! స్కూలు కెళ్తున్నా"

"టా!టా!"

నువ్వే నేను!

కవిత : బ్యూటీ పార్లర్ కి వెళ్లిస్తున్నావా, దేనికి ?

సుధ : అందంగా కనిపించడానికండీ!

కవిత : మరి కనిపించవేం ?

సుధ: ఏమోనండీ, నన్ను మీలా తయారు చేయమన్నాను మరి!





గాడిద నేర్పిన గుణపాఠం

'సూఫ్' అంటే పర్షియన్ భాషలో 'ఉన్ని' అని అర్థం. ఊలు వడికే పని చేస్తూ, సాధారణ జీవితాన్ని ఇష్టపడేవాళ్ళని అరబ్బులు "సూఫీలు" అని పిలిచేవాళ్ళు. కాల క్రమంలో సూఫీలకు తమదైన గొప్ప సంస్కృతీ, తాత్విక దృక్పథమూ ఏర్పడ్డాయి. ఈ కథ పర్షియా దేశపు సూఫీల కథ.

మూలం: పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ ఫర్ ఎ డాటర్
తెలుగు అనుసరణ: నారాయణ



చాలా కాలం క్రితం పర్షియా దేశంలోని ఒక పట్టణంలో కొందరు సూఫీలు కలిసి ఒక హోటల్ నడిపించేవాళ్ళు. సూఫీ బాటసారులు, యాత్రీకులు వేరే చోట్లకాక, ఆ హోటల్లో దిగేందుకు ఇష్టపడేవాళ్ళు.

ఒకసారి సూఫీ యాత్రికుడొకడు, చాలా దూరం నుండి ఒక మంచి గాడిదనెక్కి ప్రయాణిస్తూ, చీకటి పడే వేళకు ఆ సత్రం చేరుకున్నాడు. హోటల్ యజమాని అతన్ని సాదరంగా ఆహ్వానించి, అతను

ఉండేందుకు ఒక చక్కని గది చూపించాడు. అతని గాడిదను ప్రక్కనే గల తమ జంతుశాలలో వదలమన్నాడు. యాత్రికుడు స్వయంగా తన గాడిదను అక్కడికి తీసుకెళ్ళి, ముందుగా దానికి పచ్చిగడ్డి, దాణా పెట్టించి, "బాబూ! నా యీ గాడిదంటే నాకు చాలా ఇష్టం; దీన్ని జాగ్రత్తగా చూసుకో. ఇలాంటి మేలురకం గాడిద ఖరీదు కూడా బాగా ఎక్కువ" అని దాన్ని అక్కడి కాపలావాడికి అప్పగించి వచ్చాడు.

అదే రోజున, ఆ హోటల్లో దిగిందొక అల్లరి కుర్రాళ్ల మూక. వాళ్ళు అందరూ మామూలుగా బాగా కట్టుదిట్టాలలో పెరిగినవాళ్ళే- అయితే అవకాశం దొరికితే చాలు- స్వేచ్ఛను- అదెంత క్షణికమైనా సరే- అనుభవించాలని తపన పడే రకాలు. ఆ రోజు సాయంత్రం నుండి బాగా ప్రొద్దు పోయేంతవరకు పార్టీ చేసుకోవాలని సంకల్పించారు వాళ్ళు.

అయితే వాళ్ల దగ్గర డబ్బులెక్కడివి? మన యాత్రికుడి గాడిదను చూడగానే వాళ్ళ కళ్ళు మెరిసాయి. వాళ్ళంతా జంతుశాల కాపలావాడిని మాయచేసి, ఆ గాడిదను తీసుకెళ్ళి, గుట్టుచప్పుడు కాకుండా అమ్మేశారు. ఆ డబ్బులతో పిండి, మాంసం, నెయ్యి, నూనె, కూరగాయలు, చక్కెర, ఇంకా చాలా సారాయి- ఇవన్నీ కొనేశారు. అటుపైన అందరూ వంట పనుల్లోను, పార్టీకి కావలసిన ఇతర సరంజామా అంతా సిద్ధంచేసుకోవటంలోను మునిగారు.



కొందరు ఆ గాడిద యజమాని ఉన్న గదికి వెళ్ళి, ఆయన్ని కూడా పార్టీకి రమ్మని మర్యాదగా ఆహ్వానించి మరీ వచ్చారు!

ఎనిమిది గంటలయ్యేసరికి వంట అంతా సిద్ధమైంది. గది అలంకరణ పూర్తైంది; సంగీతం-వగైరాలన్నీ సిద్ధం అయ్యాయి. గదినిండా పెద్ద పెద్ద తివాచీలు పరిచారు. వండిన పదార్థాలన్నిటినీఆ తివాచీలమీద, గది మధ్యలో, పెద్ద పెద్ద పింగాణీ పాత్రల్లో పెట్టారు. అయితే ఇంకా గాడిద యజమాని రాలేదు. అందుకని, వాళ్ళు ఆయన్ని సగౌరవంగా పిలుచుకు వచ్చేందుకుగాను ఒక మనిషిని పంపారు- వెంట ఉండి పిలుచుకు రమ్మని. ఆయన రాగానే అందరూ ఆయన్ని రాజును పలకరించినట్లు పలకరించారు; ప్రత్యేక అతిథికోసం ఉంచిన సీట్లో కూర్చోబెట్టారు. ఆపైన ఇక అందరికీ వంటకం తర్వాత వంటకం వడ్డించారు. అందరూ తింటూ వంటవాళ్ళని మెచ్చుకున్నారు విపరీతంగా.

విందు సగంలో ఉందనగా సారాయిల్ని తెచ్చారు: రకరకాల రుచుల సారాయిలు; రకరకాల రంగుల సారాయిలు; కొత్తది-పాతది-మేలురకంది- ఇట్లా రకరకాల సారాయిలు. అక్కడ ఉన్నవాళ్ళు అందరూ తాగారు. సారాయి గొంతులోకి జారినకొద్దీ వాళ్ల పట్టు జారిపోయింది. కొందరు నవ్వుతున్నారు; కొందరు పగలబడి నవ్వుతున్నారు; కొందరు తూలుతున్నారు; కొందరు మామూలుగా పాడటం మొదలుపెట్టారు- గదిలో శబ్దాల స్థాయి బాగా పెరిగింది- చివరికి అందరూ సంగీతంమీదా, నాట్యం మీదా పడ్డారు. తినటం, తాగటం, పాడటం, నాట్యం చెయ్యటం: అందరూ ఒళ్ళు మరచిపోయారు.



వాళ్లలో ఒకడు గాడిద మీద పాట కట్టాడు- గాడిద యజమానితో సహా

అందరూ గొంతులు కలిపారు ఉత్సాహంగా-

జగతిలోని జీవాలల్లో

ఉత్తమమైనది గాడిద

అది గాడిద గాడిద గాడిద!

జంతు జాతిలో

అత్యుపయోగం గాడిద

అది గాడిద గాడిద గాడిద!

ఎవరేం తిన్నా దానికి మూలం గాడిదే

అది గాడిద గాడిద గాడిదే!

ఎవరేది త్రాగినా ఇచ్చేదా గాడిదే

గాడిద గాడిద గాడిదే!

గాడిద పాటనే అందరూ మార్చి మార్చి పాడారు: రాగాలు కట్టి; విరగ్గొట్టి పాడారు. విచిత్రం ఏంటంటే 'ఆ గాడిద తనదే' అని ఎరుగని గాడిద యజమాని కూడా ఆ పాటల్లో మునిగి తేలాడు!

అట్లా మొదలైన పార్టీ రాత్రంతా కొనసాగింది. గాడిద యజమాని బాగా అలసిపోయి, రాత్రి రెండుగంటల ప్రాంతంలో తన గదికి వెళ్ళి హాయిగా గుర్రుకొట్టి నిద్రపోయాడు.



మర్నాడు ఇక అతను లేచి, సామాన్లు సర్దుకొని ప్రయాణానికి సిద్ధమయ్యేసరికి మధ్యాహ్నం కావచ్చింది. ఆ సమయంలో గాడిదకోసం జంతుశాలకు వెళ్ళిన అతనికి, గాడిద బదులు ఖాళీ గుంజ దర్శనమిచ్చింది! కొంచెంసేపు వెతుక్కున్న తర్వాత, అతను కాపలాదారును పిలిచి అడిగాడు: "గాడిద ఏమైంది?" అని.

"అయ్యా! తమరి గాడిదని ఆ కుర్రాళ్ళంతా కలిసి తీసుకెళ్ళి అమ్మేశారండి! ఆ డబ్బులతోటే నిన్న రాత్రి పార్టీజరిపారండి!"అన్నాడు కాపలావాడు,

నిజాయితీగా.

"కానీ నేను గాడిదను నీ సంరక్షణలోనే గదా, వదిలింది? నీదే బాధ్యత. నేను నిన్ను పోలీసులకు అప్పగిస్తాను" అన్నాడు యాత్రికుడు, వేడెక్కిపోతూ.

"ఈ కుర్రాళ్ళు సార్! ఎవ్వరిమాటా వినరు. వీళ్ళనెవ్వరూ ఆపలేరు- పోలీసులైనా సరే. నేనేమైనా ప్రయత్నించి ఉంటే నన్నూ నాలుగు వాయించేవాళ్ళు" అన్నాడు కాపలాదారు, వినమ్రంగా.


"అలాగైతే నువ్వు కనీసం నాతో చెప్పి ఉండవచ్చునే!" అన్నాడు యాత్రికుడు బాధగా.

"నేను మీకు చెప్పాలని విశ్వప్రయత్నం చేశాను సార్! అయితే మీరు ఆ సమయానికి తినటంలోను, త్రాగటంలోను బిజీగా ఉండి, నేను చెప్పేదాన్ని అస్సలు పట్టించుకోలేదు. మీరు ఆ గాడిదపాట పాడుతున్నప్పుడైతే, నేను మీ ప్రక్కకు వచ్చి, మీ చెయ్యిపట్టుకొని లాగి, మిమ్మల్ని అవతలికి తీసుకుపోయేందుకు కూడా ప్రయత్నించాను. అయితే మీరు నా చెయ్యి వదిలించుకొని, మళ్ళీ వాళ్ళ మధ్యన చేరి, ఎంత గట్టిగా- ఎంత సంతోషంగా కేకలు వేస్తూ నాట్యం చేశారంటే, నేను ఇక 'ఏంజరిగిందోమొత్తం మీకూ తెలుసేమో, ఆ కుర్రాళ్ళు మీ అనుమతితోనే అదంతా చేశారేమో' అనుకొని ఊరుకోవాల్సి వచ్చింది!" అన్నాడు కాపలాదారు.

ఆలోచించగా 'అతను చెప్పిందంతా నిజమే' అని తోచింది యాత్రికుడికి. తను గాడిద పాట పాడుతున్నప్పుడు ఇతను నిజంగానే తనని ప్రక్కకి లాక్కెళ్ళాడు! తనే, అతని చేయి విదిలించుకొని, మళ్ళీ వెళ్ళి గుంపుతో పాటు గోవిందా కొట్టాడు! ఇప్పుడు, ఇక తప్పులో తనకూ భాగం ఉందని తెలిశాక, పోలీసుల దగ్గరికి పోయే ఆలోచనను విరమించుకున్నాడు అతను. "జరిగిందేదో జరిగిపోయింది- నా తప్పూ ఉంది. ఇప్పుడు చింతించి ప్రయోజనం లేదు" అనుకొని, పడుతూ లేస్తూ

వచ్చినదారి పట్టాడు.

అయితే ఆరోజున అతనికి ఒక మంచి గుణపాఠం లభించింది: "మెలకువతో ఉండి వాస్తవాన్ని చూడాలి తప్పిస్తే, ఇలా వ్యసనాలకు బానిసై, మత్తులో మునిగి తేలి, ఆ తాత్కాలిక ఆనందాన్నే సుఖం అనుకుంటే నష్టమే తప్ప- ఏమాత్రం ప్రయోజనం లేదు. తను ఇంతకాలమూ అర్రులు చాచిన సారాయి-మాంసాల మత్తు- రుచీ తాత్కాలికాలు. వాటికి లోబడే బదులు, తనలోకి తాను తొంగి చూసుకొని, ఏది సత్యమో వెతికేది మేలు" అని అతనికి అర్థమైంది!



పడిపోండి!

ఓ నర్సింగ్ హోం ప్రారంభోత్సవంలో-

ముఖ్య అతిథి: అతి త్వరలోనే మీ హాస్పిటల్ అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాను...

డాక్టర్ : థ్యాంక్యూ సర్, దేవుడు మీకొక మంచి జబ్బు తెప్పించాలని ప్రార్థిస్తున్నాను...



కరుణ చిత్తం

మూలం: బుద్ధిస్టు పారాబుల్సు

తెలుగు అనుసరణ: నారాయణ, కొత్తపల్లి బృందం.

హిమాలయ పర్వతాల పాదం దగ్గర దట్టమైన అడవి ఒకటి ఉండేది. రెండువందల యాభై అడుగుల పైఎత్తున్న దేవదారు వృక్షాలు, ఏపుగా పెరిగిన టేకు చెట్లు, వివిధ వృక్షరాజాలు, వెదురు గుబుర్లు, లతలు-తీగలతో ఆ అడవి అత్యంత మనోజ్ఞంగా ఉండేది. రకరకాల ఔషధులు, సువాసనలీనే పుష్పాలు, లెక్కలేనన్ని రకాల గడ్డి జాతులు ఆ ప్రదేశాన్ని అలంకరించి ఉండేవి. ఎన్నో పులులు, సింహాలు, ఏనుగులు, చిరుతలు, జింకలు, కుందేళ్ళు- వేల రకాల పక్షులు ఆ అడవిని

నివాసంగా చేసుకొని నివసిస్తూ ఉండేవి.

ఆ అడవిలోనే, ఒక వెదురు దుబ్బులో నివసించేది, ఒక చిలుక. దానికి ఆ అడవి అంటే చాలా ఇష్టం. తనతోబాటు నివసించే జంతువులంటే దానికి చాలా ప్రేమ. అడవిలో తనకు ఆశ్రయం ఇచ్చి కాపాడే వెదురు దుబ్బ అంటే కూడా దానికి ఎంతో అభిమానం ఉండేది.

ఒకసారి, తీవ్రంగా వచ్చిన గాలికి, వెదురు దుబ్బల్లోని వెదుర్లు ఒకదానితో ఒకటి ఎంతగా రాసుకున్నాయంటే, వాటి మధ్య గల ఘర్షణవల్ల అక్కడి గడ్డి కాస్తా అంటుకొని మండనారంభించింది. త్వరలోనే ఆ మంట చుట్టు ప్రక్కలకు వ్యాపించి, పెద్ద దావానలం అయ్యింది. ప్రళయ భయంకరంగా చెలరేగిన ఆ మంటల్లో చిక్కుకొని అసంఖ్యాక జంతుజాలం హాహాకారాలు చేస్తూ, దిక్కుతోచక పరుగులు పెడుతున్నాయి.


ముందుగానే మేల్కొన్న చిలుక ఎగిరి, ఆ మంటలకు అందకుండా తప్పించుకోగలిగింది. కానీ తన తోటి జంతువులు అలా మంటలపాలు ఔతూండటం చూసి దాని మనసు ఆర్ద్రమైంది. దయతోటీ, జాలితోటీ, కరుణ చిత్తంతోటీ అది "నా తోటి జంతువులకోసం నేను ఏం చేయగలను?" అని ఆలోచించింది. దగ్గరలోనే ఒక సరస్సు ఉన్నది- చిలుక వెళ్ళి ఆ సరస్సులో మునిగి, వేగంగా పైకెగిరి వచ్చి, మంట మీదుగా ఎగురుతూ ఒళ్ళు విదుల్చుకున్నది. మళ్ళీ వెళ్ళి, సరస్సులో మునిగి వచ్చింది. ఇట్లా మళ్ళీ మళ్ళీ అదే పని చేస్తూ, తను విదిల్చే నీటి తుంపరల వల్ల తన తోటి ప్రాణులకు ఏ కొద్దిపాటి మేలైనా జరిగితే చాలునని ఆశపడింది.

ఆ సమయంలో అక్కడే ఆకాశంలో నిలబడి, దిక్కుతోచక అటూ ఇటూ చూస్తున్న వనదేవత ఒకడు, చిలుక చేస్తున్న పనిని చూసి ఆశ్చర్యపడ్డాడు. అది నిరంతరంగా అలుపు-ఆయాసం లేనట్లు,

మళ్ళీ మళ్ళీ అదే పనిని చేస్తూండటం చూసి అతను అబ్బురపడి, దానితోబాటు తనూ ఎగురుతూ "ఓ చిలుకా, చూడగా నీకు ధైర్యం ఎక్కువ అని తెలుస్తున్నది- కానీ ఈ ప్రళయాగ్ని విజృంభణం ఎంతటిదో చూశావుగదా, నువ్వు వదిలే ఈ కొద్ది నీళ్ళ తుంపర, ఆ అగ్నిని ఏమి చేయగలదని, ఇంతగా ప్రయాస పడుతున్నావు?" అని అడిగాడు.

చిలుక చెప్పింది- "దయతోటీ, కరుణతోటీ, త్యాగంతోటీ కూడిన మనస్సు చేయలేని పని అంటూ ఏదీ లేదు. నేను ఈ పనిని ఆపను- ఈ జన్మలోనే కాదు; వీలైతే వచ్చే జన్మలో కూడా నా ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంటాను ఎలాగో ఒకలాగా ఈ మంటల్ని ఆర్పగలిగితే చాలు" అని.

చిలుక సంకల్పం వనదేవతనూ కదిలించింది. అతనూ చిలుకతో కలిసి పనిచేయటం మొదలుపెట్టాడు. ఇద్దరూ కలిసి చివరికి మంటల్ని అదుపులోకి తేగలిగారు!



టీచర్ : ఏరా,రవీ! సరళ రేఖ గురించి చెప్పరా.

రవి: మరేమోనండీ, సరళ మా అక్కండి; రేఖ మా పక్కింటి అమ్మాయండీ; వీళ్ళిద్దరూ మంచి స్నేహితులండి!



గాడిద, కుక్క, పిల్లి, కోడి ల కథ

మూలం: దబ్రీమీటౌన్‌మ్యుజీషియన్సు.
తెలుగీకరణ: G.V.G.K.*రాజు, బెంగుళూరు.*



అనగనగా ఒక ఊళ్ళో ఒక గాడిద ఉండేది. చాలా ఏళ్ళు కష్టపడి పనిచేసీ పనిచేసీ ఆ గాడిద ముసలిదైపోయింది. వాళ్ళ యజమాని ప్రతి రోజూ సణగటం మొదలుపెట్టాడు- "దీనికి తిండి పెట్టటం కూడా దండగ!" అని. దాంతో ఆ గాడిదకు మనసు విరిగిపోయింది. చివరికి అది ఒక రోజున ఇంట్లోంచి పారిపోయి, పట్నం బయలుదేరింది. పోతూ ఉంటే, దారిలో దానికి ఒక వేటకుక్క కనబడింది. అది రొప్పుతూ-రోజుతూ నిలబడి ఉన్నది, ఒక చెట్టుక్రింద. "ఏంటి కుక్క బావా! అట్లా రొప్పుతున్నావు?" అని అడిగింది గాడిద.

"నేను ముసలిదాన్ని అయిపోతు-న్నానని, మా యజమాని నన్ను చంపేద్దా-మనుకుంటున్నాడు. అందుకని పారిపో-

తున్నాను. కానీ ఎక్కడికి పోయేది?" అన్నది కుక్క.

"అయ్యో అలాగా! నేను పట్నం పోతున్నాను, మరి నావెంట వస్తావా?" అడిగింది గాడిద. సరేనని కుక్క-గాడిద కలిసి బయలుదేరాయి.

కొంచెం దూరం పోయిన తర్వాత వాటికి రోడ్డు మధ్యలో ఒక ఏడుపు ముఖం పిల్లి కనబడింది. అది కూడా ముసలిదైపోతున్నదట. దాన్ని ఎలాగైనా వదుల్చుకుందామని, దాని యజమానురాలు దాన్ని పట్టుకొని, నీళ్ళలో ముంచెయ్యబోయిందట! పిల్లి తప్పించుకొని బయట పడింది. దాని కథ విని, కుక్క-గాడిద దాన్ని తమ వెంట పట్నానికి రమ్మన్నాయి. సరేనని, కుక్క-గాడిద-పిల్లి మూడూ కలిసి బయలుదేరాయి.

అలా ఆ మూడూ నడుచుకొని పోతుంటే, ఒక ఇంటి తలుపు ముందు వాటికి పెద్దగా ఏడుపు వినబడింది. చూస్తే అది ఆ యింటి కోడిపుంజు! వాళ్ల ఇంటికి ఎవరో చుట్టాలు వచ్చారట. "నన్ను కోసి వండేస్తారట!" అని ఏడుస్తున్నదది! కుక్క-గాడిద-పిల్లిల కథలు విని, అది కూడా వీళ్ళతో కలిసి బయలుదేరింది.

అలా అవి నాలుగూ పట్నం దారిలోనడుచుకుంటూ పోతుంటే, చీకటి పడేసరికి ఒక అడవి ఎదురైంది. గాడిద, కుక్క చెట్టు క్రింద పడుకున్నాయి. పిల్లి చెట్టు కొమ్మలెక్కింది. కోడిపుంజు చెట్టు చిటారు కొమ్మ ఎక్కింది. ఆ ఎత్తునుండి చూస్తే, దానికి ఒక ఇల్లు కనబడింది. "ఓయ్! ఓయ్! చూడండి! అక్కడ ఒక చక్కని ఇల్లు ఉంది!" అని కేకలేసింది అది. "చలి మొదలు అవుతున్నది-" అని, అందరూ కలిసి ఆ యింటివైపుకు పోయారు. పోగా పోగా వాళ్లందరికీ ఇల్లు కనబడింది- కానీ ఆ యింట్లో ఎవరున్నారో కనుక్కోకుండా ఎలాగ, వెళ్ళేది? అందుకని, గాడిద మెల్లగా వెళ్ళి, కిటికీలోంచి లోపలికి తొంగి చూసి వచ్చింది-

"లోపల నలుగురు దొంగలు ఉన్నారు. చాలా తిండి తింటున్నారు వాళ్ళు! మనం తప్పని సరిగా వాళ్ళని తరిమెయ్యాలి. ఎలాగోఒకలాగా మనం నలుగురమే ఈ ఇంట్లో ఉండాలి" అనుకున్నాయి ఆ నలుగురు స్నేహితులూ.



గాడిద మీద కుక్క, కుక్క మీద పిల్లి, అందరికంటే పైన కోడిపుంజూ- ఎక్కి, అన్నీ ఒకేసారిగా అరుచుకుంటూ తలుపులు త్రోసుకొని లోపలికి పరుగెత్తేసరికి, దొంగలంతా అదిరి పడ్డారు: "అమ్మో భూతం! అమ్మో, భూతం!" అని అరుచుకుంటూ వాళ్ళు పరుగెత్తి పారిపోయారు.

గాడిదా, కుక్కా, పిల్లీ, కోడి పుంజూ బాగా కడుపునిండా తిని, కొంచెంసేపు గందరగోళంగా గానా-బజానా ఏర్పాటు చేసుకున్నాయి. ఆపైన, అవి నాలుగూ దీపాలు ఆర్పేసి, పడుకోడానికి పోయాయి. గాడిద ఇంటి వెనక దిబ్బలో పడుకుంది. కుక్క తలుపు వెనకాల చేరింది. పిల్లి పొయ్యి పక్కన బూడిదలో పడుకుంది. కోడిపుంజు ఇంటి దూలం ఎక్కి కూర్చుంది.

ఇంట్లోంచి పారిపోయిన దొంగలు కొంచెం దూరం పోయి దాక్కున్నారు. ఇంట్లో దీపాలన్నీ ఆరిపోయేసరికి, వాళ్ల నాయకుడు "మనం తొందరపడి పరుగెత్తి పారిపోయి వచ్చాం. వాళ్ళెవరో మనుషులే అయిఉంటారు- భూతాలైతే దీపాలు ఆర్పివేయవు" అని ఒక దొంగని పంపించాడు- చూసి రమ్మని.

ఆ దొంగ వచ్చేసరికి ఇల్లంతా చిమ్మ చీకటిగా ఉంది- పైగా చలి! వాడు ముందుగా వంటింట్లోకి వెళ్ళి, అగ్గిపెట్టెకోసం తడుముకోవటం మొదలుపెట్టాడు.

పొయ్యి ప్రక్కన పడుకున్న పిల్లికి వాడి చెయ్యి తగిలేసరికి దానికి ఎక్కడలేని కోపం వచ్చి, గుర్రుమని అరుస్తూ వాడిమీద పడి, గోళ్లతో వాడి ముఖం మీద గట్టిగా గీరింది. వాడుకాస్తా అదిరిపోయి, ఇంటి వెనక్కి పారిపోయి పెరటి తలుపు తీయబోయాడు. అక్కడే పడుకున్న కుక్క వాడి కాలుని పట్టుకొని ఎంతకీ వదల్లేదు. ఈ హడావిడికి వాడు తారెత్తిపోయి, లబోదిబోమంటూ పెరట్లోకి పరుగెత్తాడు. అప్పటికే లేచి తయారుగా ఉన్న గాడిద వెనక కాళ్ళు రెండూ ఎత్తి వాడి బుర్ర పగిలేట్లు ఒక్క తన్ను తన్నింది. ఈ గోలకి నిద్రలేచిన కోడిపుంజు అలవాటు కొద్దీ "కొక్కొరొక్కో" అని మొత్తుకోవటం మొదలుపెట్టింది.

నలుగురు మిత్రులు ఒకేసారి మొదలుపెట్టిన ఈ సంగీత కచేరీకి, తనకు ఎట్లా వచ్చాయోకూడా తెలీకుండా వచ్చేసిన గాయాలకి దొంగ పూర్తిగా బెదిరిపోయాడు. పడుతూ-లేస్తూ, ఆయాసపడిపోతూ వాడు పరుగెత్తుకు పోయి, వాళ్ల నాయకుడితో "నాయకా! అక్కడున్నది ఒక్క భూతం కాదు- నాలుగైదు ఉన్నట్లున్నై! పొయ్యి ప్రక్కన ఎవరో ముసలి మంత్రగత్తె ఉన్నట్లుంది- అది నా మీద పడి ముఖం అంతా రక్కింది. ఒక దయ్యం నా కాళ్ళు పట్టుకొని ఎంత గట్టిగా కొరికిందంటే, విడిపించుకోవటమే కష్టమైంది. ఒక నల్ల భూతం పెరట్లో ఉంది- అది ఏదో బండతో నా తల పగలగొట్టుదామని ప్రయత్నించింది. వాళ్ల నాయకుడు దూలం మీద కూర్చొని ఏదో భాషలో "కిక్కీకిక్కీ!" అని నవ్వుతున్నాడు!" అని చెప్పాడు.

ఆ దెబ్బకు దొంగలందరూ బాగా భయపడి వెనక్కి తిరిగిచూడకుండా పారిపోయారు. గాడిద, కుక్క, పిల్లి, కోడిపుంజూ హాయిగా ఆ ఇంట్లోనే ఉండిపోయి, రోజూ సంగీతం సాధన చేసుకుంటూ సుఖంగా ఉన్నాయి!

కాకీ కాకీ హాష్!


రచన, గానం: శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావు

కాకీ కాకీ హాష్!
కాకీ కాకీ హాష్!
కాకీ కాకీ రాకే రాకే
పాపాయ్ బువ్వ తింటోందే
కాకీ కాకీ హాష్
వెండిగిన్నెలో పప్పూ బువ్వ
గుంజు గుంజు గుంజు గుంజూ -
గోరు గోరు గోరు గోరు
కంచం అంచున రాసీ-
గోరు గుజ్జు తీసి-
గుజ్జు నోటికి పూసి-
బుజ్జి నోట ఆం..! (2)
అత్త ముద్ద ఆ..ఆ..ఆం!
అమ్మ ముద్ద ఆ..ఆ..ఆం!
నాన్న ముద్ద ఆ..ఆ..ఆం!
కాకీ కాకీ రావే రావే
బుజ్జి ముద్ద తినిపోవే!

ఈ సంచికలోని పాటలన్నిటినీ మీరు ఇంటర్నెట్లో ఉచితంగా వినచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు! సందర్శించండి: http://kottapalli.in

ఎంత అందమెంత అందమో!


రచన: శ్రీవారణాసి వెంకట్రావు, విజయవాడ.
గానం: నాగప్రవల్లిక, బి.ఈ. మూడవ సంవత్సరం, విజయవాడ.



ఎంత అందమెంత అందమో-
ఈ జగతిని-
ఎంత అందమెంత అందమో!

గళము తెరిచి పాడితే కోయిల
పూలు పూచి ఊగితే తీవియ
పురివిప్పి ఆడితే మయూరం
పడగెత్తి ఆడితే భుజంగం
"ఎంత అందమెంత అందమో"

పకపకమని నవ్వితే పాపాయి
చిలిపినవ్వు నవ్వితే చిన్నారి
ముసిముసిగా నవ్వితే ముగ్ధవధువు
బోసినవ్వు నవ్వితే బాపూజీ
ఎంత అందమెంత అందమో"


తారలెన్నొ వెల్లివిరియు ఆకాశం
పూలజల్లు రాలిపడే మధుమాసం
పంటచేల పైరుగాలి విన్యాసం
కన్యాకుమారి వరకు కనులపంట నాదేశం
"ఎంత అందమెంత అందమో"

మేం పిల్లలం

రచన, గానం: "కవికాకి" కీ.శే. జైసీతారాం

మేం పిల్లలం- రేపు పెద్దలం
రేపటి సమాజానికి రూపు దిద్దుతాం
భూగోళం మీదనున్న
ఏదేశం పిల్లలైన-
ఏభాషను మాట్లాడిన-
ఏవేషం వేసుకొన్న-
అందరమూ-అందరినీ
ప్రేమిస్తాం! ప్రేమిస్తాం! ప్రేమిస్తాం!
"మేం పిల్లలం"
కులం మతం రూపు మాపి
కలిమి-లేమి సమంచేసి
కొత్త సమాజానికి మేము
ఎత్తుతాము మాజెండా!
మా జెండా!మా జెండా!

"మేం పిల్లలం"
దోపిడీలు దొరతనాలు
అన్యాయాలక్రమాలు
ఏవీ కొనసాగనీక ఎదిరిస్తాం!
ఎదిరిస్తాం! ఎదిరిస్తాం!
"మేం పిల్లలం"
బూతు పురాణాలనెల్ల
పాతరలో పాతిపెట్టి
భౌతిక విజ్ఞానంతో పయనిస్తాం!
పయనిస్తాం! పయనిస్తాం!
"మేం పిల్లలం"
చెమటోడ్చి పనిచేసి
జాతి సంపదను పెంచే
శ్రామిక వర్గానికి మా సెల్యూట్!

పదరంగం-1

నిర్వహణ: దేవి, బెంగుళూరు.

1		2			3
				4	
5			6		
					7
	8		9		
	10				

మీకు తెలుగు బాగా వచ్చా? ఇక్కడ ఇచ్చిన గళ్ళును సరైన తెలుగు అక్షరాలతో నింపండి. సరియైన పదాలను ఎంపిక చేసుకునేందుకు గాను ఆధారాలను జాగ్రత్తగా చూసుకోండి. బ్రాకెట్లలోని అంకెల ద్వారా పదంలో ఎన్ని అక్షరాలు ఉంటాయో తెలుస్తుంది.

ఆధారాలు:

నిలువు:

1. చంద్రుడినే ఇలా ముద్దుగా పిలుస్తాం (4)
2. బంగారం (3)
3. ఒకటి తర్వాత వచ్చేది (2)
4. జుట్టు లేని తల (2)
6. చక్కెర (4)
7. చుక్ చుక్ బండి (4)
8. కోతికి ఉన్నది, మనిషికి లేనిది (2)


అడ్డం:

2. దంతం (2)
4. గొయ్యి (2)
5. వేసవిలో కాసే తీయని పండు (5)
9. 'దారి' కి బహువచనం (3)
10. కత్తిరించటానికి వాడే సాధనం (3)

కాపాడండి!

బొమ్మకు కథ రాయండి! నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com
చిత్రం: అనురాగ్ గోదావరి, 3 వ తరగతి.

ఇక్కడున్న బొమ్మను చూడండి:



ఏం జరుగుతోందో చూశారా? డైనోసార్లు! వచ్చేశాయి, నగరం మీదికి! చెల్లేమో, డైనోసారు ముందుకు వెళ్ళి దాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తోంది, చేతులు చాపి. అన్న ఒక చిన్న తుపాకీ పట్టుకొని, మరి ఎటు తిరిగి ఉన్నాడోగాని, ఉన్నాడు. హెలికాప్టర్లు, క్రేన్లు, పవర్ హోలు- అన్నీ వచ్చేసినై, అప్పుడే- లేకపోతే విధ్వంసాన్ని ఆపేదెలాగ? మీకు ఆ కథ తెలుసు కదూ, రాసి పంపించండి. మీ కథ బాగుంటే దాన్ని కొత్తపల్లి పత్రిక మే2011 సంచికలో ప్రచురిస్తాం.

మా చిరునామా:

కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101

వెల:

ప్రతి ఒక్కింటికి: 20 రూ.

12 భాగాలు: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోను: 08559 240222

ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

ముఖచిత్రం: వీరాంజనేయులు

బొమ్మలు: అడవిరాముడు, శివప్రసాద్, జాహ్నవి, వై.రాజు.

కార్టూన్లు: 'విద్యార్థి' కృష్ణ, వివియస్ మూర్తి.

బొమ్మకు కథ: లలిత, telugu4kids

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు:

కార్టూన్ల వివియస్ మూర్తి గారికి, ప్రకృతి బడికి, టింబక్టు బడికి, అరవింద స్కూలుకు, విద్యార్థి సృజన కుటీరానికి, నందన గ్రామీణ పాఠశాలకు, వెంకటేశ్వర బాలకుటీరానికి, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు, గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.

కథల కథ

అనగా అనగా ఒక చిన్న కథ తయారైంది. గెంతుకుంటూ, ఆడుకుంటూ పోతోంది ఆకాశంలో. అంతలో దానికొక రామచిలుక ఎదురైంది.

"చిట్టి కథా, చిట్టి కథా! నువ్వు భలే కనిపిస్తున్నావు. నేను నిన్ను తీసుకుంటాను, ప్లీజ్!" అన్నదది.

"తీసుకో, తీసుకో! దాందేముంది? నేనున్నదే అందరికోసం!" అన్నది చిన్న కథ.

రామచిలుక చిట్టి కథను తీసుకోగానే కథలు రెండైనై! చిలకేమో ఒక కథను పట్టుకొని ఎగురుకుంటూ పోయింది- బిగ్గరగా అరుచుకుంటూ.

ఇంకో కథ తన దారిన తను పోతూ ఉంటే చిన్నారి పాప ఒకతె ఎదురైంది దానికి, ఓ చెట్టుకొమ్మను పట్టుకొని.

"ఏం, చిన్నారీ! ఎటు పోతున్నావు, ఒక్కతెవే? మీ అమ్మేది?" అంది కథ.

"అమ్మ పోయి కొమ్మ వచ్చె ఢాం ఢాం ఢాం!" అని నవ్వింది పాప. కథకి పాపను చూస్తే ముచ్చట వేసింది.

అది పాపతో కలిసి పోయి, వాళ్ళ అమ్మనీ, అమ్మమ్మనీ, నాన్ననీ అందర్నీ చుట్టుకొని వచ్చింది.

రామచిలుక అక్కడ అరచుకొంటూ పోతుంటే మొద్దురాముడు ఎదురయ్యాడు దానికి: "ఏయ్! చిలకా! భలే కథ ఉన్నట్లుందే, నీ దగ్గర? నాకూ చెప్పు! వింటాను!" అన్నాడు వాడు.

"ఊరికే వింటే ఏం లాభం? రాయాలి! నీకు చేతులున్నై కద!" అంది చిలుక.

"ఊహ్! ఓహ్! అయ్యో! రాయటం రాదే!" మూలిగాడు వాడు.

"కుదరదు నాన్నా! నన్ను అందుకుంటే రాయాల్సిందే!" అన్నది కథ. "సరే" అని వాడు రాయటం నేర్చుకున్నాడు.

ఈ సారి ఒక్క కథే పది కథలైంది- ఎవరెవరినో చేరింది. అందరికీ చదవటం నేర్పింది.

ఆ కథని చదివిన పిల్లలెవ్వరూ దాన్ని ఆపుకోలేదు- అందరి దగ్గరా అది రెండింతలు అవుతూనే పోయింది. ఆ పిల్లల స్నేహితులు- వాళ్ళ అమ్మా నాన్నలు- వాళ్ళ స్నేహితులు- ఇట్లా పోతూనే ఉంది కథ- అందరూ విన్నారు; అందరూ చదివారు; అందరూ చెప్పారు!

చాలా ఏళ్ళ తర్వాత మాకు చెప్పిందొక పాప, ఆ కథని- "ఓయ్, కథా! రా! నిన్ను కొత్తపల్లిలో వేస్తాం" అన్నాం మేం.

"మా బాగా వేసుకోండి! నేనున్నదే అందరికోసం!" అన్నది కథ.

"సరేగానీ, నిన్నెవరు తయారు చేశారు, మొదట?" అడిగాం, మేం, పెద్దవాళ్ళం.

"అయ్యో! నేను ఎన్ని చోట్ల తిరిగాను, ఎంత మారాను! ఎప్పుడో ఒక రామచిలుక పాడింది నన్ను! ఒక మొద్దు రాముడు రాశాడు నన్ను! కానీ ఎందరు పిల్లలు బ్రతికించారో, ఏం చెప్పను? ఎంతమంది పెద్దలు మెచ్చి కాపాడారో, ఏమనను? మీరేమైనా మొదటివాళ్ళా? మీపని మీరు కానివ్వండి! నా దారిన నేను ఎగురుతూనే ఉంటాను" అని నవ్వింది కథ.

ఇదీ, ఈ కథల కథ!

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada, Phone:08662579129

నల్ల చేప పిల్ల

సమాజం ఎప్పుడూ ఒకేలాగా ఉండదు. మనం అలవాటు పడిన వ్యవస్థలు చాలావరకు గతంలో లేవు- భవిష్యత్తులో ఉండకపోవచ్చు.

"ప్రతిదానికీ తుది ఉంటుంది కదమ్మా? జీవితం అంటే ఈచిన్న సెలయేటిలోముసలితనం వచ్చేవరకూ ఇటునుంచి అటు, అటునుంచి ఇటు ఈదుతూ ఉండటమేనా? ఈ విశాల ప్రపంచంలోజీవించటానికి మరోదారి ఏదైనా ఉందేమో తెలుసుకుందామని అనుకుంటున్నాను" అన్నది నల్ల చేపపిల్ల.

చేపపిల్ల తల్లి ఏడ్చింది. "నా చిట్టితల్లి మనసును ఏ రాక్షసుడు మార్చేశాడో" అంది. ఇరుగు పొరుగు చేపలు వాటి ఇంటిముందు గుమిగూడాయి. "మీ పొరుగున ఉండటం మాకెంతో సిగ్గుచేటుగా ఉంది " అన్నాయికోపంగా.

"పో, పో, నువ్వుఏదో ఒకనాడు చేపలు పట్టేవాడి గాలానికి చిక్కకపోవు" అన్నది మరో చేప.


"మనం ఉన్నదే అసలైన ప్రపంచం. ఇంకో ప్రపంచమంటూ లేదే, పిచ్చిదానా, వెనక్కి తిరిగి రా" బుజ్జగించింది మరోచేప.


నల్లచేప పిల్ల ముందుకే వెళ్ళింది. సెలయేట్లోంచి నదిలోకీ, నదిలోంచి సముద్రంలోకీ వెళ్లింది. నత్తల్ని చూసింది. 'వాటికీ చేపలకీ శత్రుత్వం ఎందుకున్నది?' అని ఆశ్చర్యపడింది. తొండని చూసింది. దానితో స్నేహం చేసి బాకునొకదాన్ని బహుమతిగా పొందింది. చందమామతోమాట్లాడింది. చేపలన్నిటినీ మింగేస్తున్న గూడకొంగను చంపేసింది. సముద్రపు కాకిని హతం చేసింది. కొన్ని చేపలకు ఆదర్శంగా నిలిచింది. మరికొన్నిటికిస్ఫూర్తినిచ్చింది.

పాలు తాగే పసి పిల్లలు చదవాల్సిన పుస్తకం కాదిది- ఇదొక తిరుగుబాటు బావుటా, విప్లవ కావ్యం.

"...పదకొండు వేల తొమ్మిదివందల తొంభైతొమ్మిది చేపలూ ఈ కథను విని, వెళ్ళి పడుకున్నై. ఒక్క చేపకు మాత్రం నిద్రపట్టలేదు. రాత్రంతా అది సముద్రం గురించే ఆలోచిస్తూమెలకువగా ఉండిపోయింది"

..ఆ ఒక్క చేపా ఎవరు.. మీరేనా?





నల్ల చేప పిల్ల

The Little Black Fish

రచన: సమద్ బెహరంగీ

ప్రచురణ: మంచిపుస్తకం, మార్చి 2010